ఆంధ్రజ్యోతి




బాపట్ల జిల్లా వార్తలు

3 గురువారం 18 జనవరి 2024



• నరసరావుపేట ప్రాంతంలో అధిక వర్షాలకు దెబ్బతిన్న మిరప పంట



ప్రయోగాలు ప్రహసనం

ఇంటర్ కళాశాలల్లో అరకొరగానే ల్యాబులు

• సౌకర్యాలు, పరికరాలపై పట్టించుకోని బోర్డు
• ల్యాబు ఫీజు పేరుతో ప్రైవేటు యాజమాన్యాల దోపిడీ
• ప్రయోగ పరీక్షా కేంద్రాల్లో తూతూమంత్రంగా వార్షిక తనిఖీలు



గుంటూరు(విద్య), జనవరి 17: ఇంటర్ మీడియట్ సైన్సు గ్రూపుల విద్యార్థులకు ఆయా సబ్జెక్టులతో పాటు ప్రయోగ పాఠాలు కూడా ముఖ్యమే. అయితే పలు కళా శాలల్లో ల్యాబులు, పరీక్షలు ఓ ప్రహస నంగా మారాయి. మొదటి సంవత్సరం నుంచి కళా శాలల్లో ప్రయోగాలకు సంబంధించి బోధన చేయాలి. ద్వితీయ సంవత్సరంలో వాటికి సంబంధించి పరీక్షలు ఉంటాయి. ఇందులో భాగం గా ఇంటర్ మీడియట్ కళాశాలల్లో ప్రత్యేకంగా ల్యాబులు, ప్రయోగ రసా యనాలు, పరికరాలు, బోధకులు తప్ప నిసరి. అయితే అరకొర కళాశాలల్లోనే ఇంటర్ బోర్డు నిబం ధనలకు అనుగుణంగా ల్యాబులు ఉంటున్నాయి. అనేక ప్రైవే టు కళాశాలల్లో ల్యాబులే ఉండవు. ఆయా కళాశాల ల్లో చదివే విద్యార్థులకు ప్రయోగాలు అంటే ఏమిటో కూడా తెలియదంటే ఆశ్చర్యం కాదు. ఒకవేళ ఏదైనా కళాశాలలో పేరుకే ల్యాబు ఉంటుంది.. అందులో అవ సరమైన పరిక రాలు ఉండవు.. ఇక బోధకలు అసలే ఉండరు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విద్యార్థులతో వారంలో ఒక రోజు ల్యాబుల్లో ప్రయోగాలు చేయించాలని నిబంధనలు ఉన్నా యాజమాన్యాలు మాత్రం సంవత్సరం చివర వరకు ల్యాబుల్లో వారిని అడుగుపెట్టనీయడం లేదు. ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల్లోని ల్యాబుల్ని వార్షికంగా తనఖీ చే యాల్సిన ఇంటర్ బోర్డు మిన్నకుండి పోతున్నదనే ఆరోప ణలున్నాయి. ల్యాబుల్లో సరైన పరికరాలు ఉన్నాయా? ఉంటే వాటి పనితీరు ఎలా ఉంది? విద్యార్థులు ఉపయో గించాల్సిన రసాయనాలు, వాటిని ఎలా ఎంత మోతాదులో ఉపయోగించాలి. వచ్చిన ఫలితాన్ని ఎలా నమోదు చేయా లి అనే విషయాలు స్పష్టంగా రికార్డుల్లో నమోదు చేయాలి. ఇందుకోసం కెమిస్ట్రీ, ఫిజిక్స్, బోటనీ తదితర సబ్జెక్టుల్లో నిష్ణాతులైన అధ్యాపకుల్ని ఓ కమిటీగా నియమించి పరిశీ లన చేయించాలి. అయితే ఇవేమి పట్టించుకోకుండానే ఇం టర్ బోర్డు పరీక్షలు నిర్వహిస్తుందనే ఆరోపణలున్నాయి.

వచ్చే నెలలో ప్రయోగ పరీక్షలు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు దాదాపు 48 వేల మంది ఉన్నట్లు సమాచారం. ఇంటర్ బోర్డు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి రెండోవారం నుంచి ప్రయోగ పరీక్షలు జరగనున్నాయి. ఇందు కోసం మొత్తం 140పైగా కేం ద్రాలు ఏర్పాటు చేశారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ విద్యా ర్థులకు షెడ్యూల్ వారీగా పరీక్షలు నిర్వహించనున్నా రు. అయితే కేంద్రాల్లో పూర్తి స్థాయిలో సౌకర్యాలు ఉన్నా యో లేదో పరిశీలించడం లేదనే ఆరోపణలున్నాయి. అసలు ప్రయోగాలు అంటే ఏమిటో తెలి యకుండా సైన్సు గ్రూపుల విద్యార్థులు ఏమి పరీక్ష లు రాస్తారో ఎవరికీ తెలియదు.

ఇక్కడ వసూళ్లు.. అక్కడ చెల్లింపులు..

ఇంటర్ బోర్డు నిర్వహించే ప్రయోగ పరీక్షలకు ప్రైవే టు, కార్పొరేట్ యాజమాన్యాలు భారీగానే ఫీజులు వసూ లు చేస్తున్నాయి. ఇంటర్ బైపీసీ విద్యార్థుల నుంచి రూ.1500, ఎంపీసీ విద్యార్థుల నుంచి రూ.1000 చొప్పున కొన్ని కళాశాలలు వసూలు చేస్తున్నాయి. ల్యాబ్ ఫీజు పేరుతో వసూలు చేసే ఈ మొత్తంలో సగం ఇంటర్ బోర్డు కు అనధికా రికంగా చెల్లించి, మరికొంత పరీక్షల సమ యంలో వచ్చే ఇన్విజిలేటర్లకు చెల్లిస్తారనే ఆరోపణలు న్నాయి. ఫలితంగా ప్రయోగ పరీక్షల్లో ఇన్విజిలేషన్ చూసీ చూడనట్లు ఉంటారనే ఆరోపణలున్నాయి. ఇలా ఏ టా ప్రయోగ పరీక్షలు ఓ ప్రహసనంగా నిర్వహిస్తున్నారనే విమర్శలున్నాయి.

బీమా ఇవ్వని బీమా

ప్రకృతి పంటల సాగుకు సహకరించడంలేదు. తీవ్ర వర్షాభావం.. కుండపోత వర్షాలు ఇలా అతి వృష్టి, అనావృష్టి రైతులను దారుణంగా దెబ్బతీశాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట డిసెంబరు నెలలో కురిసిన అతి భారీ వర్షాలకు వర్షార్పణం అయింది. సాధారణం కన్నా వెయ్యింతల అధిక వర్షపాతం పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో నమోదైంది. మిరప పంటకు అపార నష్టం వాటిల్లింది. ఈ తరుణంలో రైతులకు వాతావరణ ఆధారిత బీమా పథకం నుంచి పరిహారం అందించాలి. అయితే అధికారులు కానీ, ప్రభుత్వం కానీ బీమా విషయంలో పట్టీపట్టనట్లు వ్యవహ రిస్తున్నా రు. పల్నాడు జిల్లాలో సాధారణ వర్షపాతం కన్నా 4969.88 శాతం, బాపట్ల జిల్లాలో 3348.35 శాతం, గుంటూరు జిల్లాలో 6567.86 శాతం అత్యధి కంగా వర్షపాతం నమోదైనట్లు వాతా వరణ శాఖ నివేదికలు తెలియజేస్తున్నాయి.

- తీవ్రంగా నష్టపోయిన మిర్చి రైతులు
- బీమా గురించి పట్టించుకోని అధికారులు
- డిసెంబరు నెలలో రెట్టింపు వర్షపాతం నమోదు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వం వాతావరణ ఆధారిత బీమా పథకాన్ని ప్రవేశ పెట్టింది. దానిలో మిర్చి పంటను కూడా చేర్చింది. సాధా రణ పంటల బీమాకు, వాతావరణ ఆధారిత బీమాకు పూర్తిగా వ్య త్యాసం ఉంది. సాధారణ పంటల బీమా అమలులో సాగు చేసిన పంటలో 33 శాతం పూర్తిగా పంట దెబ్బతింటేనే నష్ట పరిహారం చెల్లిస్తారు. వాతావరణ ఆధారిత బీమ పథకం అలా ఉండదు. ఈ బీమా పథకం కింద అధిక వర్షపాతం, అధిక ఉష్ణోగ్రత, అధిక గాలి, సాధారణం కంటే తక్కువ వర్షపాతం, తేమ వంటి ప్రతికూల పరి స్థితుల కారణంగా కలిగే పంట నష్టాలకు బీమా వర్తిస్తుంది. వా తావరణ శాఖ వర్షపాతం నివేదికల ఆధారంగా పంట నష్టాన్ని అంచనా వేస్తారు. అధిక వర్షాలు కురిసి పంటలు దెబ్బతింటే పరి హారం చెల్లిస్తారు. తీవ్ర వర్షాభావం వలన కలిగే నష్టాలకూ పరిహారం అందిస్తారు. పంట వివిధ స్టేజ్‌లలో అధిక వర్షాలు, వర్షాభావం వల న కలిగే నష్టాన్ని నమోదు చే యాల్సి ఉంది. పంటకు బీమా ప్రీమియం చెల్లించే ప్రతి రైతు ఈ పథకం కింద అర్హులే. రైతుల తరుపున తామే బీమా ప్రీమియం చెల్లిస్తున్నా మని వైసీపీ ప్రభుత్వం ఆర్భాటం గా ప్రకటించింది. అంతే కాకుండా ఈ క్రాప్ న మోదు, ఈకేవైసీ చే ం ు ం చుకున్న ప్రతి రైతు పంటల బీమాకు అర్హుడని ప్రకటిం చింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు మిరప సాగు చేసిన రైతులందరికీ ఈకేవైసీ పూర్తి చేసినట్లు ఉద్యాన శాఖ అధికారులు ప్రకటించారు. అంటే మిర్చి సాగు చేసిన రైతులందరికీ బీమా వర్తిం చినట్లే. అధికారిక లెక్కల ప్రకారం పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 1,89,770 ఎకరాల్లో మిరప సాగైంది. అత్యధికంగా పల్నాడు జిల్లాలో 1,25,881 ఎకరాల్లో, బాపట్ల జిల్లాలో 25,337 ఎకరాలు, గుంటూరు జిల్లాలో 38,550 ఎకరాల్లో మిరప సాగు చేశారు. ఈ సంవత్సరం మిరప మొక్కలు నాటిన నాటి నుంచి తీవ్ర వర్షాభావం నెలకొంది. అంతే కాకుండా డిసెంబరు నెలలో అతి భారీ వర్షాలు కురిశాయి. ఇలా రెండు విధాలా మిరప రైతులు నష్టపోయారు. మిరప తొలికాపు దశలో అధిక వర్షాలు కురిశాయి. దీని వలన దిగుబడులను కోల్పోయారు. ఎకరాకు సగటున 30 శాతంకు పైగా మొక్కలు ఎండి పోయి ఎకరాకు నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ళ వరకు దిగుబడులను రైతులు కోల్పోయారు.

అతి భారీ వర్షాలు.. తీవ్ర వర్షాభావం

డిసెంబరు 5,6 తేదీల్లో అతి భారీ వర్షాలు కురిశాయి. ఈ రెండు రోజుల్లో పల్నాడు జిల్లాలో సాధారణ వర్షపాతం 3.22 మీ.మీ కాగా 163.25 మీ.మీ వర్షపాతం నమోదైంది. 4969.88 శాతం అధికంగా వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. బాపట్ల జిల్లా సాధారణ వర్షపాతం 5.77 మీమీ కాగా 198.97 మీమీ వర్షపాతం నమోదైంది. 3348.35 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది. గుంటూరు జిల్లాలో సాధారణ వర్షపాతం 2.52 మీమీ కాగా168.03 వర్షపాతం నమోదైంది. 6567.86 శాతం అధికంగా వర్షపాతం న మోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. అక్టోబరు నెలలో తీవ్ర వర్షా భావం నెలకొంది. పల్నాడు జిల్లాలో సాధారణ వర్షపాతం 118.21 మీమీ కాగా 22.34 మీ.మీ వర్షపాతం నమోదైంది. 81.1 శాతం లోటు వర్షపాతం నెలకొంది. బాపట్ల జిల్లాలో సాధారణ వర్షపాతం 171.92 మీ.మీ కాగా 34.43 మీ.మీ వర్షపాతం నమోదైంది 79.97 శాతం లోటు వర్షపాతం నమో దైంది. గుంటూరు జిల్లాలో సాధారణ వర్షపాతం 128.8 మీ.మీ కాగా 25.9 మీ.మీ వర్షపాతం నమోదు కావడంతో 79.89 శాతం లోటు వర్షపాతం నెలకొంది. అక్టోబరులో తీవ్ర లోటు వర్షపాతం, డిసెంబరు నెలలో వేల రెట్ల అధిక వర్షపాతం నమోదు కావడంతో మిరప రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇలా జరిగిన పంట నష్టం వాతావారణ ఆధారిత బీమా కిందకు వస్తుంది. వాతావరణ శాఖ వర్షపాతం నివేదికలు ఆధారంగా, పంట నష్టం కోసం మిరపకు ఉద్యాన శాఖ నివేదికలు పంపించాల్సి ఉంటుంది. ఈ దిశగా సదరు శాఖ స్పందిస్తున్న దాఖలాలు లేవు. వాతావరణ బీమా పథకం కింద పరిహారం అందుతుందా లేదా అన్న ఆందోళన బాధితుల రైతుల నుంచి వ్యక్తమవుతున్నది. అధిక వర్షాల వలన పంటలను కోల్పోయిన రైతులకు బీమా ఆదుకునే అవకాశం ఉన్నా ఈ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. వాతావరణ బీమా కింద మిరపకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

సున్నా వడ్డీకి.. సున్నాయేనా..?

• ఖరీఫ్ ముగిసినా కరుణించని ప్రభుత్వం
• ఉమ్మడి జిల్లాలో 54 వేల మందికి శఠగోపం
• ఎన్నికల కోడ్ సమీపిస్తోన్నా నిధుల విడుదలపై మౌనం
• రైతులకు దక్కాల్సిన రూ.16 కోట్లకు పంగనామాలు

గుంటూరు సిటీ, జనవరి 17: ఆరుగాలం రెక్కల కష్టంపై ఆధారపడుతూ.. ప్రకృతి వైపరీత్యాలను.. అతి వృష్టి.. అనా వృష్టిలని ఎదుర్కొని అందరికీ అన్నం పెడు తున్న రైతులపై వైసీపీ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను చూపిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. అన్నదాతలకు కల్పించే చిన్నా చితక ప్రయోజనాలపై ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. సున్నా వడ్డీ పథకానికి నాలుగేళ్లకే నూరేళ్లు నిండినట్లు కనిపిస్తోంది. ఖరీఫ్ సీజన్ దాటిపోయినా వడ్డీ రాయితీ సొమ్మును రైతుల ఖాతాల్లో ఇంతవరకు జమ చేయలేదు. నేడో రేపో ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నప్పటికీ సున్నా వడ్డీ నిధులపై ప్రభుత్వం మితిమీరిన మౌనాన్ని ప్రదర్శిస్తుం ది. ఆయా జిల్లాల నుంచి సున్నా వడ్డీ రాయితీ పొం దేందుకు అరు లైన రైతుల వివరాలు అధికార యంత్రాం గం సిద్ధం చేసి పంపింది. అయినా నిధుల విడుదల విషయాన్ని ఉన్నతాధికారులు గోప్యంగా ఉంచుతు న్నారు. ఫలితంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో 54 వేల మంది రైతుల రాయితీ ప్రయోజనంపై దెబ్బపడింది. రైతులు తీసుకున్న పంట రుణాల పై పూర్తిగా వడ్డీ మాఫీ చేయడం సున్నా వడ్డీ పథకం ముఖ్య ఉద్దేశం. రైతు సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గొప్పగా ప్రకటించారు. 2020లో సున్నా వడ్డీ పథకాన్ని ప్రారంభించారు. ప్రారం భించిన రెండేళ్లు హడా వుడి చేశారు. మూడో ఏడాది నుంచి నిధుల విడుదల నత్తనడకన సాగగా, నాలుగో ఏట అసలు నిధుల విడుదల ప్రస్తావనే లేకుండా పోయింది. ప్రభుత్వం వడ్డీ మాఫీ చేస్తుందన్న ఆశతో రైతులు పంటలు పండినా పండక పో యినా అప్పు చేసి మరీ బ్యాంకులకు రుణాలు చెల్లించారు. గుంటూరు జిల్లాలో 12,208 మంది, పల్నాడు జిల్లాలో 23,271 మంది, బాపట్ల జిల్లాలో 18,227 మంది రైతులు సకాలంలో రుణా లను బ్యాంకులు, సహకార సంఘాలకు చెల్లించారు. వీరంతా సున్నా వడ్డీ కింద లబ్ధి పొందేం దుకు అర్హులేనని వ్యవ సాయ శాఖ జాబితా సిద్ధం చేసింది. ప్రతి ఏటా పంట సీజన్ ముగిసే నాటికి రైతుల ఖాతాల్లో వడ్డీ డబ్బులు జమ వుతాయని అప్పట్లో ముఖ్యమంత్రి బహిరంగంగా ప్రకటిం చారు. రైతులు సకాలంలో రుణం చెల్లిస్తే సరిపో తుంది వడ్డీ సొమ్ము ఖాతాల్లో జమ అవుతుందని బీరాలు పలికారు. లక్ష రూపాయల వరకు రుణాలు తీసుకున్న వారికి వడ్డీ మొత్తం ప్రభుత్వం చెల్లిస్తుం దని ఊదరగొట్టారు. ఈ లెక్కన 2022 -2023 ఖరీఫ్ సీజన్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా రైతులకు అక్షరాల రూ.16 కోట్లు ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేయా ల్సి ఉంది. గుంటూరు జిల్లాలో రూ.3 కోట్ల 40 లక్షలు, పల్నా డు జిల్లాలో రూ.7 కోట్ల 19 లక్షలు, బాపట్ల జిల్లాలో రూ.5 కోట్ల 20 లక్షలు చొప్పున చెల్లించాల్సి ఉంది. సీజన్ ముగిసినా ఏ ఒక్క రైతు ఖాతాలో రూపాయి కూడా జమ కాలేదు.

'కోడ్' కూస్తే అనుమానమే

సున్నా వడ్డీ నిధులపై అధికార యంత్రాంగం ఏమీ చెప్ప లేక పోతుంది. ఇప్పటికే జాబితాలు పంపినప్పటికీ వాటిని పూర్తిగా పరిగణనలోకి తీసుకున్న దాఖలాలు కనిపిం చటం లేదని కొందరు ఉద్యోగులు చెబుతున్నారు. ఎన్నికల కోడ్ వ స్తే సున్నా వడ్డీ నిధుల విడుదల అనుమానమేనని అంటున్నారు.

ఓటర్ల జాబితాల విడుదలకు చర్యలు

• పారదర్శకంగా దరఖాస్తుల పరిశీలన • రాజకీయ నేతలతో కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, జనవరి 17: ఓటర్ల తుది జాబితా విడుదలకు యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయపార్టీల నాయకులతో బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబ ర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 22న తుది ఓటర్ల జాబితాలను విడుదల చేస్తామ న్నారు. అన్ని నియోజకవర్గాలలో వచ్చిన 2,06,672 దరఖా స్తులను పరిశీలించామని, 1,69,644 దరఖాస్తులను విచా రించామన్నారు.. 30,699 దరఖాస్తులను తిరస్కరించగా 6,329 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. నూతన ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, సవరణల కొరకు వచ్చిన దరఖాస్తులను అత్యంత పారదర్శకతతో పరి శీలిస్తున్నామన్నారు. రాజకీయపార్టీల నుంచి వచ్చిన ఫి ర్యాదులను పరిగణలోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దివ్యాంగులు, వృద్ధుల కొ రకు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ర్యాంప్‌లు నిర్మిస్తున్నామని చెప్పారు. సమావేశంలో డీఆర్వో పి.వెంకటరమణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కృష్ణకాంత్, బీజేపీ నాయకులు రామకృష్ణ, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు దోనేపూడి రవి, వైసీపీ నాయకులు ఇ నగలూరి మాల్యాద్రి, టీడీపీ నాయకులు గౌస్‌బాషా తదిత రులు పాల్గొన్నారు.



రాజకీయపార్టీల నాయకులతో సమావేశమైన కలెక్టర్ పి.రంజిత్‌బాషా

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

జిల్లావ్యాప్తంగా గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బా షా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ని ర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఏఎస్పీ పి.మహేష్‌కు చెప్పారు. పరేడ్‌గ్రౌండ్, కలెక్టరేట్‌లో సుందరీకరణ పనులకు సంబంధించి మున్సిపల్ కమిష నర్ ఎ.భానుప్రతాప్‌ను ఆదేశాలు జారీ చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తెలియజేసే స్టాల్స్, శకటాలు ఏర్పాటు చేయాలన్నారు. అధికారులకు, ఉద్యోగులకు సేవా పతకాలు, అవార్డులు ప్రదానం జరుగుతుందన్నారు. విద్యా ర్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డీఈవో రామారావుకు సూచించారు. సమావేశంలో జేసీ శ్రీధర్, డీఆర్వో వెంకటరమణ, డీఆర్‌డీఏ పీడీ సి.కృష్ణ, డ్వామా పీడీ డాక్టర్ బి.అర్జునరావు, హౌసింగ్ పీడీ ప్రసాద్, వ్యవసాయశాఖ జేడీ షేక్.అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, మత్స్యశాఖ జేడీ పి.సురేష్, పౌరసరఫరాలశాఖ అధికారి విలియమ్స్, జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు రైల్వే పశ్చిమ టెర్మినల్ ప్రారంభం

ఇక అరండల్‌పేట వైపు నుంచి కూడా రాకపోకలు

గుంటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే స్టేషన్ వెస్టు టెర్మినల్ ప్రయాణికులకు అందు బాటులోకి వచ్చింది. నూతనంగా నిర్మించిన ఈ టెర్మినల్‌ని ఎలాంటి హంగు, ఆర్భాటం లేకుండా రైల్వే శాఖ ప్రారంభించింది. దీంతో ప్రయాణికులకు రెండు వైపుల నుంచి ప్రవే శించే సదుపాయం కల్పించినట్లైంది. అన్‌రిజర్వుడ్ టిక్కెట్ల జారీకి ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. అలానే ఇప్పటి వర కు అరండల్‌పేట ఒకటో లైనులో బుక్ స్టాల్స్ మధ్య ఉన్న ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ కౌంటర్లని వెస్టు టెర్మినల్‌లోకి తీసుకొచ్చేశారు. దీంతో ప్రయాణికులు రిజర్వేషన్ టిక్కెట్ల బుకింగ్ కోసం వెస్టు టెర్మినల్‌లోకి వెళ్లాల్సి ఉంటుంది. దా దాపుగా రూ.29 కోట్ల వరకు వెచ్చించి అధునాతన సౌకర్యా లను వెస్టు టెర్మినల్ వైపు కల్పించారు. లిఫ్టులు, ఎస్కులేటర్ల ఏర్పాటుతో ప్రయాణికులు సులభతరంగా ప్లాట్‌ఫాంల పైకి చేరుకోవచ్చు. అలానే సువిశాలమైన పార్కింగ్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. అమరావతి సంస్కృతి ఉట్టిప డేలా స్టేషన్ పశ్చిమ వైపు భవనాన్ని తీర్చిదిద్దారు. వెస్టు టెర్మినల్ ప్రయాణికులకు కొత్త అనుభూతిని పంచుతుం దని రైల్వే డివిజనల్ మేనేజర్ రామకృష్ణ తెలిపారు.



అనుసరణీయం.. చిరస్మరణీయం

'కళ కళ కోసం కాదు ప్రజా శ్రేయస్సు కోసం' అని త్రికరణ శుద్ధిగా విశ్వసించి తదనుగుణంగా నడుచుకున్న ఏకైక కథానాయకుడు విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు అంటే అతిశయోక్తి కాదు. అనేక చిత్రాల్లో బడుగు, బలహీన వర్గాల పక్షం నిలచి వారి కోసం న్యాయపోరాటం చేసే పాత్రల్లో నటించిన యన్టీఆర్, ఆయా వర్గాల అభిమానాన్ని విశేషంగా చూరగొన్నారు. తనను అంతగా అభిమానించే వారికి ఏదైనా చేయాలన్న తలంపుతోనే యన్టీఆర్ రాజకీయప్రవేశం చేసిన సంగతి కొత్తగా చెప్పవలసిన పనిలేదు. కోట్ల రూపాయలు సంపాదించి, ఆ రోజుల్లోనే కోట్ల ఆదాయం చూస్తూ రాజభోగాలు అనుభవించిన యన్టీఆర్ 'పేదవాడే దేవుడు' అని నమ్మి వారి కోసం 'తెలుగుదేశం' పార్టీ నెలకొల్పి, జనంలోకి వచ్చారు. ఆ రోజుల్లో యన్టీఆర్‌కు జనం పట్టిన బ్రహ్మరథం తరాలు మారినా అనితరసాధ్యంగానే నిలిచింది. కేవలం తొమ్మిది మాసాల్లోనే రాజకీయ రంగంలోనూ అధికారాన్ని చేజిక్కించుకొని, అప్పటికీ ఇప్పటికీ అనితర సాధ్యమైన చరిత్రను సృష్టించారు రామారావు. ఆయన రాజకీయ ప్రవేశాన్ని ఎద్దేవా చేసినవారు, అనుభవరాహిత్యం అని విమర్శించిన వారు సైతం ముక్కున వేలేసుకొనేలా పాలన సాగించి, పలు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టి బడుగు, బలహీన వర్గాల వారి అభివృద్ధికి పాటు పడ్డారు యన్టీఆర్. ఆయన ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాలు ఇప్పుడు పేర్లు మార్చుకొని, రంగులు వేసుకొని చెలామణీ అవుతున్నాయి. 'సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు' అని చాటడమే కాదు, వారి పురోభివృద్ధికి అహర్నిశలూ పాటుపడ్డారు రామారావు. అందుకే తెలుగుదేశం పార్టీ ఈ నాటికీ వెలుగుతూనే ఉంది. జయాపజయాలు ఎలా ఉన్నా, తెలుగుదేశం పార్టీ మనుగడ సాగుతూనే ఉంది. భావితరాలను సైతం ప్రభావితం చేసే దిశగా పార్టీ నడక సాగిస్తోంది. రాబోయే ఎన్నికల్లో మళ్ళీ విజయదుందుభి మోగించడానికి సిద్ధమవుతోంది. సినిమా రంగంలోనూ, రాజకీయరంగంలోనూ.. వెరసి ప్రజా జీవితంలో తాను ఉన్నప్పుడే కాదు.. తన తదనంతరం కూడా తన ప్రభావం కొనసాగేలా చేయగలగడం ఒక్క యన్టీఆర్‌కే చెల్లింది. అందుకే ఆయన యుగపురుషుడని, శకపురుషుడని చరిత్ర ఆయనకు నీరాజనాలు పలుకుతోంది. యన్టీఆర్ ఆశయసాధన కోసం పాటుపడేవారందరూ మళ్ళీ 'తెలుగుదేశం' పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధమవుతున్నారు. యన్టీఆర్ ఉండగా, తెలుగుదేశం సాధించిన ఘనవిజయాల కోవకు చెందే రీతిన విజయం సాధించాలని అన్నగారి అభిమానులు ఆశిస్తున్నారు. వారి సంకల్పం ఫలించాలని, యన్టీఆర్ వర్ధంతి సందర్భంగా కోరుకుందాం.

● కొమ్మినేని వేంకటేశ్వరరావు



వాఘాలో వందేమాతరం

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా భారత వైమానిక దళం నేపథ్యంలో రూపొందుతున్న దేశభక్తి చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. మాజీ విశ్వసుందరి మానుషి చిల్లర్ కథానాయిక. ప్రతాప్‌సింగ్ హడా దర్శకత్వంలో సందీప్ ముద్దా నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 16న విడుదలవుతోంది. ఈ చిత్రంలోని తొలి గీతాన్ని యూనిట్ బుధవారం పంజాబ్‌లోని వాఘా సరిహద్దుల్లో ఆవిష్కరించింది. ఈ కార్యక్రమంలో వరుణ్‌తేజ్, మానుషి చిల్లర్ చిత్రబృందంతో పాల్గొన్నారు. వైమానిక దళం యుద్ధానికి సన్నద్ధమవుతున్న నేపథ్యంలో వచ్చే గీతమిది. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. మిక్కీ జే మేయర్ స్వరపరచగా అనురాగ్ కులకర్ణి ఆలపించారు.

మిల్లర్ కిల్లర్




ధనుష్ కథానాయకుడిగా నటించిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'కెప్టెన్ మిల్లర్'. సంక్రాంతికి తమిళంతో పాటు ఇతర భాషల్లోనూ విడుదలైంది. ఈ నెల 25న తెలుగు వెర్షన్ విడుదలవుతోంది. ఏషియన్ మల్టీప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థలు తెలుగు హక్కులు సొంతం చేసుకున్నాయి. వెంకటేశ్, నాగార్జున సోషల్ మీడియా వేదికగా బుధవారం 'కెప్టెన్ మిల్లర్' ట్రైలర్‌ను విడుదల చేశారు. బ్రిటిషర్లను తుదముట్టించే ఆవేశపరుడైన దేశభక్తుడిగా ధనుష్ సరికొత్త గెటప్పుల్లో కనిపించారు. ఈ చిత్రంలో ప్రియాంక మోహన్ కథానాయిక. సందీప్ కిషన్, డాక్టర్ శివరాజ్‌కుమార్ కీలకపాత్రల్లో నటించారు. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో జి. శరవణన్, సాయి సిద్ధార్థ్ నిర్మించారు. సంగీతం: జీవీప్రకాశ్ కుమార్. సాయి సిద్ధార్థ్

ఫియర్‌కు వేదికగా



హీరోయిన్ వేదిక లీడ్‌రోల్‌లో నటిస్తున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'ఫియర్'. హరిత గోగినేని దర్శకత్వంలో ఏఆర్ అభి నిర్మిస్తున్నారు. అరవింద్ కృష్ణ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. బుధవారం పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ ప్రారంభమైంది. తొలిషాట్‌కు దర్శకుడు కరుణాకర్ క్లాప్ ఇచ్చారు. నటుడు మురళీమోహన్ స్క్రిప్ట్‌ను యూనిట్‌కు అందించారు. ఈ సందర్భంగా వేదిక మాట్లాడుతూ 'సస్పెన్స్ థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసేలా మా దర్శకురాలు కథను తయారుచేశారు. తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుందన్నారు. దర్శకురాలు మాట్లాడుతూ 'ప్రేక్షకులకు మంచి సినిమా అందించాలని ఏడాది పాటు కష్టపడి కథ తయారుచేసుకున్నాను. వేదిక పాత్ర ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణ' అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'హరిత నా వైఫ్. తన సినీరంగం పట్ల ఇష్టం, వివిధ విభాగాలపై అవగాహన ఉన్నాయి. తను 'ఫియర్'తో దర్శకురాలిగా అరంగేట్రం చేయడం ఆనందంగా ఉంది. వేదిక ఛాలెంజింగ్ రోల్ చేస్తున్నారు' అని తెలిపారు. ఈ చిత్రంలో ప్రేక్షకులను ఎంటర్టైన్ చేసే అంశాలు చాలా ఉన్నాయని అరవింద్ కృష్ణ అన్నారు. పవిత్రా లోకేశ్, షాయాజీ షిండే, అనీష్ కురువిల్ల కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనూప్‌రూబెన్స్, సినిమాటోగ్రఫీ: ఐ ఆండ్రూ



'బిట్స్' ఇంజనీరింగ్

అడ్మిషన్ టెస్ట్

పిలానీలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్)- 'బిట్స్‌ఏట్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ద్వారా ఇంటిగ్రేటెడ్ ఫస్ట్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. హైదరాబాద్ క్యాంపస్, పిలానీ క్యాంపస్, కేకే బిర్లా గోవా క్యాంపస్‌లలో ఈ టెస్ట్‌లో సాధించిన ర్యాంకుతో అడ్మిషన్ పొందవచ్చు. బీఈ, బీఫార్మసీ, ఎమ్మెస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొందిన అభ్యర్థులు మొదటి సంవత్సరం పూర్తయిన తరవాత ఇంజనీరింగ్ డ్యూయెల్ డిగ్రీలో చేరే వీలుంది.

కోర్సులు-స్పెషలైజేషన్‌లు

బీఈ స్పెషలైజేషన్‌లు: కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్, మెకానికల్, మాన్యుఫాక్చరింగ్

బీఫార్మసీ

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: బయలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, మేథమెటిక్స్, ఫిజిక్స్, జనరల్ స్టడీస్

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. బీఫార్మసీ ప్రోగ్రామ్‌కు బయాలజీ అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గ్రూప్ సబ్జెక్టులకు సంబంధించి ఒక్కోదానిలో కనీసం 60 శాతం మార్కులు, మొత్తమ్మీద 75 శాతం మార్కులు ఉండాలి. ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం తప్పనిసరి.

దరఖాస్తు ఫీజు: పురుషులకు రూ.3,400; మహిళలకు రూ.2,900; రెండో విడత ఎగ్జామ్ రాయాలంటే పురుషులు రూ.2,000; మహిళలు రూ.1500 అదనంగా చెల్లించాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 11

వెబ్‌సైట్: bitsadmission.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..

సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/UzXVOmHలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో

అకడమిక్ కోర్సులు

హైదరాబాద్‌లోని డా. బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్ఏఓయూ)- గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

డిగ్రీ: బీఏ, బీకాం, బీఎస్సీ

ఎంఏ స్పెషలైజేషన్‌లు: జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ.


ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, సైకాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిజిక్స్, జువాలజీ. మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది.

ఇవి కాకుండా పీజీ డిప్లొమాలు, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు కూడా ఉన్నాయి

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 31
- **వెబ్‌సైట్:** www.braouonline.in







వైసీపీలో ఎవడైన చేరతాడా ?

- అది నీతి, జాతి లేని పార్టీ ..
- ఆ పార్టీని సమాజం నుంచే వెలివేయాలి
- మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ధ్వజం
- చివరి శ్వాస వరకు టీడీపీలోనే.. మరోసారి స్పష్టం



గుంటూరు(తూర్పు), జనవరి17: వైసీపీ నీతి, జాతి లేని పార్టీ.. ఆ పార్టీలోకి ఎవడైన చేరతాడా? అంటూ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ గురజాల నియోజకవవర్గ ఇన్‌చార్జి యరపతినేని శ్రీనివాసరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తన చివరి శ్వాసవరకు టీడీపీలోనే ఉంటానని, జగన్ పత్రిక, వైసీపీ సోషల్‌మీడియా ఆడుతున్న విష క్రీడకు భయపడనని స్పష్టం చేశారు. రాజకీయాల్లోనే కాదు.. సమాజం నుంచే వైసీపీని వెలివేయాలంటూ ఆయన ఘాటుగా స్పందించారు. బుధవారం గుంటూరు నగరంలోని విద్యానగర్‌లో గల ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో యరపతినేని మాట్లాడుతూ... జగన్ సొంత పత్రిక, సోషల్ మీడియాను అడ్డుపెట్టుకుని తనపై, కుటుంబ సభ్యులపై జగన్, సజ్జల రామకృష్ణారెడ్డి విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీలోకి జగన్ రావడం ఎంత నిజమో యరపతినేని వైసీపీలోకి రావడంకూడా అంతే నిజమని వ్యంగ్యంగాచెప్పారు. గురజాల నియోజకవర్గంతో తనకు విడదీయని అనుబంధం ఉందని, టీడీపీ తరుపున ఆరుసార్లు పోటీ చేసానని, 7వ సారీ పోటీ చేయబోతున్నట్టు స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో జగన్‌రెడ్డిని ఇంటికి పంపడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేకే సజ్జల భార్గవ్ రెడ్డి ఆధ్వర్యంలో సోషల్ మీడియాలో తనపై ఇష్టం వచ్చినట్లు దూషిస్తూ వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. నాలుగేళ్లుగా టీడీపీని తిట్టించి ఇప్పుడు వారికే టికెట్లు ఇవ్వకుండా జగన్ రెడ్డి వారి గొంతు కోశారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఎవరెన్ని చెప్పినా జగన్, ఆయన పరివారం జీవితాంతం జైల్లోనే ఉంటారని స్పష్టం చేశారు. గురజాల నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి చేస్తున్న అక్రమాలపై విచారణ తప్పదని హెచ్చరించారు. పిడుగురాళ్లలో పది ఎకరాలు దేవదాయ భూమిని అన్యాక్రాంతం చేసారని, ఈ ఘటనలో అధికారులపాత్రపై విచారణ జరుపుతామన్నారు. అధికారంలోకి రాగానే గురజాల కేంద్రంగా పల్నాడుజిల్లాను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే గురజాల అభివృద్ధి కోసం జనసేన-టీడీపీ ఉమ్మడి మేనిఫెస్టోను రూపొందించామని. దానిని త్వరలోనే ప్రకటిస్తామని యరపతినేని తెలిపారు.



రైల్ సేవా పురస్కార్ అవార్డు గ్రహీతలతో డివిజనల్ రైల్వే మేనేజర్ రామకృష్ణ

గుంటూరు డివిజన్‌కి

'రైల్ సేవా పురస్కార్' అవార్డులు

గుంటూరు సిటీ, జనవరి 17 : గుంటూరు డివిజన్ రైల్ సేవా పురస్కార్ అవార్డులు దక్కించుకుంది. 68వ రైల్వేవీక్ అవార్డులు-2023వ సంవత్సరంలో ప్రతిభ కనుపరచిన అధికారులు, ఉద్యోగులకు బుధవారం అందజేశారు. గుంటూరులోని పట్టాభిపురం రైల్వే డీఆర్‌ఎం కార్యాలయంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌స్థాయిలో 13 మంది రైల్‌సేవా పురస్కార్ అవార్డులు అందుకున్నారన్నారు. వారిలో ఖాతా శాఖకు చెందిన అధికారి ఏడీఎఫ్ ఎం.షణ్ముఖేశ్వరరావు, మెడికల్ బ్రాంచ్ అధికారి డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్‌లతో పాటు వివిధ శాఖలకు చెందిన వైఎస్ పద్మారావు, వీ.దుర్గాప్రసాదు, ఎస్.అంకమ్మరాజు, ఎస్.కోటన్‌రాజు, వీ.రామశేషారెడ్డి, డీ.పద్మ, వీ.నాగరాజు, వై.కరుణకుమార్, కె.శామ్యూల్ ప్రసాద్, సీహెచ్ సురేష్, పీ.వేణు ఉన్నారన్నారు. కార్యక్రమంలో కే. సైమన్, అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ ప్రభాకర్ రాజు, రైల్వే హాస్పిటల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ షాహబాజ్ హనూర్, పలువురు అధికారులు పాల్గొన్నారు

మాతృభాషను మరవొద్దు..



జ్యోతిప్రజ్వలన చేస్తున్న వెంకయ్యనాయుడు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు తదితరులు

- గుడి ఎంత పవిత్రమైనదో బడి అంతే పవిత్రమైనది
- విశ్వగురువుగా అవతరించనున్న భారతదేశం
- వ్యవసాయం మన ప్రాథమిక సంస్కృతి
- మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు

నరసరావుపేటటౌన్, జనవరి17: కన్నతల్లిని, జన్మభూమిని, మాతృభాషను, మాతృ దేశాన్ని, గురువును మరచినవాడు మనిషేకాదని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు అన్నారు. బుధవారం పల్నాడుజిల్లా నరసరావుపేటలో కే-రిడ్జి ఇంటర్‌నేషనల్ స్కూల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో వెంకయ్య నాయుడు మాట్లాడుతూ ఇంగ్లీషు నేర్చుకోండి కానీ పిల్లవాడిని ఇంగ్లీషువాడీగా తయారు చేయవద్దన్నారు. నూతన విద్యావిదానంతో పాటు విద్యను భారతీకరణ చేయాలన్నారు. ఇంట్లో, వీధిలో, గుడిలో, బడిలో, అమ్మ వడిలో నుంచి వచ్చిన మాతృభాష అందరికి అలవాటు చేయాలన్నారు. మాతృభాష కళ్ళలాంటివి అని, ఇంగ్లీషు కళ్ళ అద్దలాంటివి అన్నారు. ముందు భాషనేర్చుకోవాలని, తర్వాత విషయం నేర్చుకోవాలన్నారు. ప్రాథమిక విద్య మాతృభాషలో ఉంటే విషయం నేరుగా మనస్సులోకి వెళ్ళ తుందన్నారు. మొదట మాతృభాష, తర్వాత సోదర భాష, ఆతర్వాత ఇతర భాషలు నేర్చుకోవాలన్నారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధాన మంత్రి వీళ్ళందరూ మాతృ భాషలో చదువుకొని పైకొచ్చారన్నారు. గుడి ఎంత పవిత్రమైనదో బడి అంతే పవిత్రమైనదన్నారు. ఆధునిక పోకడలతో టీవీ, మొబైల్ ఫోన్‌వంటి వాటికి అలవాటిపడి స్వంత ఆలోచనలు తగ్గిపోయి విద్యార్థుల మనస్సుల్లో జడత్వం నాటుకుపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు విజ్ఞానం, శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానం ఎంతో ముఖ్యమైనప్పటికీ, వాటితో పాటు ప్రాపంచిక పరిజ్ఞానం అతి ముఖ్యమని అన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారాన్ని నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. చెట్ల మధ్యన విద్యాసంస్థల ఆవరణం, పరిసరాలు ఉండాలన్నారు. అలాగే కొంత ఖాళీ స్థలం ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆస్థలంలో నిర్వహించే క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. యోగ నేర్చుకోవాలన్నారు. సుసంపన్నమైన శక్తివంతమైన భారతదేశంలో అందరం పైకి రావాలంటే నైపుణ్యాభివృద్ధి ఎంతో అవసరమన్నారు. మన దేశం శక్తివంతంగా ముందుకు వెళుతుందని, భారతదేశం విశ్వగురువుగా అవతరించనుందన్నారు. ప్రపంచంలో భారతదేశం 3వ ఆర్థికశక్తిగా తయారు కాబోతుందన్నారు. అమెరికా, చైనా దేశాలతో పోటీపడే స్థాయికి భారతదేశం వస్తుందన్నారు. డిజిటల్ అంతిమ లక్ష్యం ప్రజలను సంతోషంగా, సుఖవంతం చేయడానికేన్నారు. వ్యవవసాయం అనేది మన ప్రాథమిక సంస్కృతి అని, రైతులను బతికించుకోవడం దేశ ప్రజలందరి కర్తవ్యం అన్నారు. ప్రకృతిని మనం ప్రేమిస్తే ప్రకృతి మనలను ప్రేమిస్తుందన్నారు. పిల్లలకు నాయకత్వ లక్షణాలు నేర్పించాలని, వాళ్లను నిరుత్సాహ పర్చవద్దని తల్లిదండ్రులకు సూచించారు. వకృత్వ, వ్యాసరచన పోటీలలో పాల్గొనేవిధంగా, క్రీడలలో పాల్గొనే విధంగా, పదిమంది ముందు, పది మందితో మాట్లాడటాన్ని విద్యార్థులకు చిన్నప్పటి నుంచే అలవాటు చేయాలని సూచించారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత..

కే-రిడ్జి ఇంటర్‌నేషనల్ స్కూల్ నిర్వహించిన పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు ముఖ్య అతిథులు అందజేశారు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, బనగాన పల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధనరెడ్డి, వినుకొండ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మద్రాసు ఫర్టిలైజర్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.వెంకటరావు, టీడీపీ నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల వెంకటేశ్వరరావు, పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, కృష్ణవేణి డిగ్రీ కళాశాల డైరెక్టర్ కే.నాసరయ్య, బాజీ చౌదరి, స్వాతి, సురేఖ పాల్గొని బహుమతులు అందజేశారు.

టీడీపీ పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్
- వైసీపీ వీడి టీడీపీలోకి పలువురి చేరికలు



వైసీపీ శ్రేణులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, జనవరి 17: రాష్ట్రంలో సైకో జగన్ పాలన తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని టీడీపీ పార్టీకి ప్రతి కార్యకర్త అండగా నిలవాలని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. నిజాంపట్నం మండలం కూచినపూడిగ్రామంలో టీడీపీ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కొలసాని రాము ఆధ్వర్యంలో కూచినపూడి పంచాయతీకి చెందిన వైసీపీ నేతలు ఇంకొల్లు తిరుపతయ్య, నాగమల్లేశ్వరరావు అన్నపరెడ్డి తాతారావు, శివయ్య, సంపత్, కాటూరి రామకృష్ణ, సుదీర్, గుండబొమ్మల శ్రీనివాస్, తోట రోశయ్య, అన్నపరెడ్డి నాగేంద్రబాబు, నరేంద్ర, అనిల్, కారుమూరి ఫణీంద్ర, కుటుంబరావు, గాదె గోపి, శ్రీనివాస్, ఇమ్మిడి ఆంజనేయులు, కొలసాని పృధ్వీకుమార్, వినయ్ ఆకుల శివకుమార్, యశ్వంత్‌కుమార్‌లు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెలేయ అనగాని టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలోకి చేరే నాయకులు, కార్యకర్తలకు వారికి అండగా ఉంటామని, ఎలాంటి అధైర్యపడాల్సిన పనిలేదని వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లపాటి యల్లయ్య, ఇంకిశెట్టి శ్రీను, కొలసాని శ్రీనివాసరావు, ఎం.ఉమామహేశ్వరరావు, నిజాంపట్నం జడ్‌పీటీసీ నర్రా సుబ్బయ్య, పంతాని మురళీధరరావు, గూడపాటి శ్రీనివాసరావు, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ, పూషడపు కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.



షమీమ్‌ను పరామర్శిస్తున్న ముస్తాక్ అహమ్మద్, ఆలీఖాన్, జీవీ ఆంజనేయులు


టీడీపీ నేతలపై హత్యాయత్నం

- వైసీపీ గుండాల దాడులను ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే బొల్లా
- దాడిచేసిన వ్యక్తులను 48 గంటల్లో అరెస్ట్ చేయాలి
- టీడీపీ రాష్ట్ర ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు ముస్తాక్ అహమ్మద్
- మాజీ ఎమ్మెల్యే జీవీతో కలసి బాధితులకు పరామర్శ

వినుకొండ, జనవరి 17 : టీడీపీ నాయకులపై హత్యాయత్నానికి పాల్పడిన వైసీపీ గూండాలను తక్షణమే అరెస్ట్ చేయాలని టీడీపీ రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు ముస్తాక్ అహమ్మద్ డిమాండ్ చేశారు. వైసీపీ అరాచకశక్తుల దాడిలో గాయపడి ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి షమీమ్‌ఖాన్‌తో పాటు మరికొంతమంది వ్యక్తులను బుధవారం పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ముస్లిం మైనార్టీ పార్లమెంటు అధ్యక్షుడు అమీర్ ఆలీఖాన్‌తో కలిసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ముస్తాక్ మాట్లాడుతూ పోలీసులు అధికారపార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని, పోలీసులు సక్రమంగా విధులు నిర్వహిస్తే దాడులు జరిగేవి కావని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు వ్యతిరేకంగా ఉండే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులకు పాల్పటం వైసీపీ గూండాలకు పరిపాటిగా మారిందన్నారు. ఈ అరాచక చర్యలను సహించేది లేదని హెచ్చరించారు. బాధిత కార్యకర్తల పక్షాన న్యాయపోరాటం చేస్తామని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. అమీర్ ఆలీఖాన్ మాట్లాడుతూ ఓటమి భయంతోనే స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అరాచక వ్యక్తులను ఉసుగొల్పుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ.. స్థానిక ఈ దాడుల వెనకనున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు త్వరలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. నియోజకవర్గంలో అరాచక శక్తు లను ఎమ్మెల్యే బొల్లా ప్రోత్సహిస్తున్నారని, ఇందుకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. దాడికి పాల్పడిన వైసీపీ గూండాలను 48 గంటల్లో అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. బాధితులను పరామర్శించిన వారిలో నియోజకవర్గ పరిశీలకుడు మానుకొండ శివప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, నేతలు వెంకట్రావు, పేరయ్య, ఆంజనేయులు, డీసీకొండలు తదితరులు ఉన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

వట్టిచెరుకూరు,జనవరి 17: వట్టిచెరుకూరు మండలం కారంపూడిపాడు గ్రామానికి చెందిన తోటకూర చంద్రయ్య(55) అనే కౌలు రైతు బుధవార ఆత్మహత్య చేసుకున్నాడు. వట్టిచెరుకూరు మండల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌలు రైతు చంద్రయ్య గతేడాది 11 ఎకరాలు కౌలుకి తీసుకొని వరి సాగు చేశాడు. ఆ సందర్భంగా వచ్చిన తుఫాన్, వరదల దాటికి కోత కోసిన 6 ఎకరాల పంట వరద ఉధృతికి కొట్టుకు పోయింది. అలాగే 4 ఎకరాల్లో పంట పూర్తిగా నీటమునిగి మట్టిపాలైంది. దీంతో చంద్రయ్య తీవ్రంగా నష్టపోయాడు. పెట్టుబడికి తెచ్చిన అప్పులు పెరిగి పూర్తిగా రుణభారంలో కూరుకుపోయిన చంద్రయ్య తీవ్ర మనస్థాపానికి గురై బుధవారం తెల్లవారుజామున గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబీకులు వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం డీవీసీ ఆసుపత్రికి తీసుకెళ్ళగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చంద్రయ్యకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.



అరుణ్ హల్దర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అరుణ్‌కుమార్ తదితరులు

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇవ్వొద్దు

- ఎస్సీ కమిషన్ జాతీయ చైర్మన్ అరుణ్‌హల్దర్‌కు విజ్ఞప్తి

గుంటూరు, జనవరి 17: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో నిందితులకు స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని ఎస్సీ కమిషన్ జాతీయ చైర్మన్ అరుణ్ హల్దర్‌కు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో భాగంగా నగరానికి విచ్చేసిన చైర్మన్‌ను బుధవారం అరుణ్‌కుమార్ ఆసంఘ నేతలతో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం తమ విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. దళితులపై ఇటీవల దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. దాడుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను సక్రమంగా అమలు చేయాలని, ప్రమోషన్‌లలో రిజర్వేషన్‌లు పాటించాలని కోరారు. ముఖ్యంగా పెండింగ్‌కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీఐ జాతీయ కార్యదర్శి పేరం నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు డాక్టర్ షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో జగన్ ముఖంతో మోదీ పాలన..

- సీపీఐ తెలంగాణ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న తెలంగాణ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పొన్నూరుటౌన్, జనవరి17: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖంతో ప్రధాని నరేంద్రమోదీ పాలన సాగిస్తుడన్నాడని సీపీఐ తెలంగాణ కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు అన్నారు. బుధవారం ఆయన పొన్నూరు పట్టణ సమీపంలోని ఆయన స్వగ్రామం సంగుపాలెం కోడూరు విచ్చేశారు. అనంతరం పట్టణ కేంద్రానికి వచ్చిన ఆయన సీపీఐ నేతలతో కలసి విలేకరులతో మాట్లాడుతూ.. నరేంద్ర మోదీకి జగన్‌మోహన్ రెడ్డికి విడదీయరాని అనుబంధం ఉందని, జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎన్ని తప్పులు జరుగుతున్నా నరేంద్ర మోదీ చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారని ఆరోపించారు. జగనన్న వదిలిన బాణం, షర్మిల ఎందుకు బయటకు వెళ్లిందో.. కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎలా అయ్యిందో చెప్పాల్సిన అవసరం సీఎం జగన్‌పై ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు జగన్ పాలనను రాక్షస పాలనగానే చూస్తున్నారన్నారు. నరేంద్ర మోదీ, జగన్మోహన్‌రెడ్డి న్యాయ వ్యవస్థలను సైతం ప్రభావితం చేసేలా పాలన సాగిస్తున్నారని, '17 ఏ' పై భిన్న తీర్పులు రావటానికి ఈ ప్రభావితమే కారణమని ఆరోపించారు. అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవాన్ని ప్రభుత్వ కార్యమైందని, ప్రతిష్ఠా కార్యక్రమంలో ఉండాల్సిన మఠాచార్యులు వెలుపల ఉంటే వెలుపల ఉండాల్సిన ప్రధానమంత్రి పెద్ద ధర్మకర్తలా మునిగితేలుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రజల కోసం మంచి ఆలోచనలు చేయకపోతే ప్రజలు తిరిగి నష్టపోతారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సీపీఐ పొత్తు స్థానిక రాష్ట్ర నాయకత్వం తీసుకుంటుందన్నారు. సమావేశంలో సీపీఐ నేతలు కుప్పలా సత్యానారాయణ, ఆరేటి రామారావు, ఎంఎం ఖుద్దూస్, మహ్మద్‌ఖాలీద్, అధ్యాపకుడు చితరంజన్ తదితరులు పాల్గొన్నారు.



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

అమరావతి వినాశనమే జగన్‌రెడ్డి లక్ష్యం

- రాజధానిని ఒక్క అంగుళం కూడా కదపలేరు : రైతులు
- 1492 వ రోజుకు చేరుకున్న దీక్షలు, ఆందోళనలు

తుళ్లూరు జనవరి 17: అమరావతిని నిర్వీర్యం చేయటమే లక్ష్యంగా సీఎం జగన్‌రెడ్డి పావులు కదుపుతున్నారని రాజధానికి 33 వేల ఎకరాలు త్యాగం చేససిన రైతులు ఆరోపించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళన బుధవారం నాటికి 1492వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ.. రాజధానిని అమరావతి ప్రాంతం నుంచి ఒక్క అంగుళం కూడా కదల్చలేరన్నారు. మూడు రాజధానులు నాటకాన్ని ఇకనైనా ఆపాలన్నారు. రాష్ట్ర ఏకైక రాజధాని అమరావతేనని స్పష్టం చేశారు. అమరావతిని అభివృద్ధి చేయమన్న హైకోర్టు తీర్పును ఇకనైనా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అమరావతివెలుగు కార్యక్రమం నిర్వహించారు. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. తుళ్లూరు వెలగపూడి, మందడం,వెంకటపాలెం, ఉద్దండ్రాయునిపాలెం, నెక్కల్లు అనంతవరం తదితర రాజధాని గ్రామాల్లో ఆందోళనలు, దీక్షలు కొనసాగాయి.



విలేకరులతో మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

న్యాయ వ్యవస్థను దిగజార్చేలా పొన్నవోలు వ్యాఖ్యలు

- మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆగ్రహం

గుంటూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ పత్రిక, మీడియాలో ఏఏజీ పొన్నవోలు సుధాకర్ చేసిన వ్యాఖ్యలు న్యాయ వ్యవస్థను దిగజార్చేలా ఉన్నాయని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 17ఏ చట్టంపై సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం తీర్పుపై అడిషినల్ అడ్వకేట్ పొన్నావోలు మాట్లాడటం సమాజాన్నీ తప్పుదోవపట్టించేలా ఉందన్నారు. అవినీతి నిరోధక చట్టం గురించి కోర్టు తీర్పులు ఒకరకంగా చెబితే ఏఏజీ పొన్నవోలు దానికి వక్రభాష్యం చెప్పడం సిగ్గుచేటన్నారు. వివిధ కేసుల్లో ఇంతవరకు కోర్టుకు హాజరుకానివారు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబుపై వైసీపీ ప్రభుత్వం పెట్టిన కేసుల్లో ఇంతవరకు ప్రాథమిక ఆధారాలను కూడా కోర్టుకు సమర్పించలేదన్నారు. చంద్రబాబుపై నిరాధార ఆరోపణలతో కేసులు పెట్టి రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్న మాట వాస్తవంకాదా అని ప్రశ్నించారు. ఒక న్యాయవాదిగా పొన్నావోలు మాట్లాడే తీరు అభ్యంతరకరమన్నారు. సీఐడీ సంస్థ సీఎం జేబు సంస్థగా మారిపోయిందని, దానికి అడ్వకేట్ జనరల్ పొన్నవోలు రాజకీయ నేతగా మారటం నిస్సిగ్గుగా ఉందన్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు మాట్లాడుతూ టీడీపీ హయాంలో 125 అడుగుల ఎత్తు విగ్రహం అమరావతి రాజధాని నడిబొడ్డున పెట్టాలని నిధులు మంజూరు చేసి ప్రారంభం చేస్తే దానిని విజయవాడకు తరలించి ప్రచారం చేసుకోవడం ముఖ్యమంత్రికి సిగ్గుచేటన్నారు. దళిత నియోజకవర్గంలో అంబేద్కర్ విగ్రహం పెట్టకూడదా అని నిలదీశారు. అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టి రూ.300 కోట్ల నిధులను జగన్‌రెడ్డి దోచుకుతిన్నాడని విమర్శించారు. సమావేశంలో ఎం.దారు నాయక్, కంచర్ల శివరామయ్య, ఎన్‌వీవీఎస్ వరప్రసాద్ పాల్గొన్నారు.

20, 21 తేదీల్లో మంగళగిరిలో

చేనేత కార్మికసంఘ రాష్ట్ర మహాసభలు

మంగళగిరి సిటీ, జనవరి 17: ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర 13వ మహాసభలు ఈనెల 20,21 తేదీల్లో మంగళగిరిలోని మార్కం దేయ కల్యాణమండపంలో నిర్వహించనున్నట్టు సంఘ రాష్ట్ర ఉపాధ్య క్షుడు పిల్లలమర్రి నాగేశ్వరరావు తెలిపారు. మంగళగిరిలోని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. 20వ తేది మధ్యాహ్నం రాష్ట్రస్థాయి సదస్సు జరుగు తుందని, ఈ సదస్సుకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ కే.వియన్నరావు, ప్రొఫెసర్ నరసింహారెడ్డి, జేవీ సత్యనారాయణ మూర్తి, సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ హాజరవుతారని తెలిపారు. చేనేత కార్మికులు, నేతలు పెద్దసంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మహాసభల ఆహ్వాన కమిటీ గౌరవాధ్యక్షుడు జొన్నాదుల వరప్రసాద్, సీపీఐ ఏరియా కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గజవల్లి వెంకట కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి బత్తూరి మోహన్‌రావు, నియో జకవర్గ అధ్యక్షుడు బత్తుల గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

యడ్లపాడు, జనవరి 17 : ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసిన సంఘటన మండల కేంద్రమైన యడ్లపాడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన బండ్ల భాస్కర్ కొండల సమీపంలో పేకాట శిబిరాన్ని నిర్వహించాడు. ఎర్ర చెరువు ప్రాంతానికి చెందిన కొందరు మద్యం తాగి పేకాట శిబిరం వద్దకు వెళ్లారు. శిబిరాన్ని నిర్వహిస్తున్న భాస్కర్ ఇక్కడకు ఎందుకు వచ్చారంటూ పరుషపదజాలంతో వారిని దూషించాడు. దీంతో ఆగ్రహం పట్టలేక భాస్కర్‌పై దాడిచేశారు. అనంతరం భాస్కర్ తన సామాజికవర్గానికి చెందిన వారిని పెద్ద ఎత్తున పోగు చేసి ఎర్రచెరువు కాలనీవాసులపైకి దాడికి ప్రయత్నించాడు. అప్రమత్తమైన కాలనీ వాసులు కూడా దాడికి సిద్ధమయ్యారు. ఇరువర్గాల మధ్య కొద్దిసేపు తీవ్ర వాగ్వివాదంతో పాటు తోపులాట జరిగింది. స్థానికుల సమాచారంతో ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు రుకుని ఇరు వర్గాల వారిని చెదరగొట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119, 130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

78,137 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు (గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ)కి బుధవారం 82,687 టిక్కీలు విక్రయానికి రైతులు తీసుకురాగా వాటిల్లో 78,137 అమ్మకాలు జరిగాయి. ఇంకా యార్డులో 38,422 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మిర్చి వెరైటీల ధరలు ఇలా...

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8500	20000	334	11500	11500
నెంబరు. 5	17500	18000	నెంబరు. 5	–	–
273	11000	15000	273	–	–
341	8900	19500	341	14000	17000
4884	12500	13000	4884	–	–
సూపర్ 10	--	–	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	22500	తేజ	15500	15500
బ్యాడిగి	9000	21000	బ్యాడిగి	–	–
దేవనూరు డీలక్స్	11000	20000	దేవనూరు డీలక్స్	–	–
తెల్లకాయలు	5000	13000	తెల్లకాయలు	5500	12000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

ప్రజావ్యతిరేక చట్టం రద్దు చేయాలి

● బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమా లీలా కృష్ణ

బాపట్ల, జనవరి 17: ప్రజావ్యతిరేక చట్టాన్ని రద్దుచేయాలని బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమా లీలాకృష్ణ డిమాండ్ చేశారు. బాపట్ల పాతబస్టాండ్ కూడలిలో ఆంధ్రప్రదేశ్ భూమిహక్కుల యాజమాన్యం చట్టం రద్దు చేయాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే దీక్షల్లో బుధవారం న్యాయవాదులు విన్నకోట సత్యప్రసాద్, కంచర్ల అవి నాష్, కత్తి నాగలక్ష్మి, యాతం సతీష్‌రాజా, బి.నాగప్రసాద్‌లు కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని సందర్శించిన లీలాకృష్ణ మాట్లాడుతూ ఈచట్టంలో భూమి కలిగిన వ్యక్తి మరణిస్తే ఆ వ్యక్తి వారసుల పేర్లు వారి స్థిరాస్తి హక్కు సదరు టైటిలింగ్ అధికారి నిర్ణయించి వారి పేర్లు రిజిష్టర్ నమోదు చేస్తారన్నారు. హక్కు నిర్ధారణ విషయంలో వివాదాలు ఉన్నట్లైతే రిజిష్టరింగ్ అధికారి వివాదాన్ని కోర్టుకు రెఫర్ చేస్తారన్నారు. భూయజమాని భూమిని ఎవరైన అక్రమించిన 12 సంవత్సరాలలోపు అతని హక్కును నిర్ధారించి రికవరి కోసం కోర్టులో దావా వేసే అవకాశం ఉండేదన్నారు. కాని దీని కాలపరిమితి ఈ చట్టంలో 5 సంవత్సరాలకు తగ్గించి కుదించారన్నారు. ఈ చట్టప్రకారం ఎవరైన మన భూమిలో అక్రమంగా 5 సంవత్సరాలు ఉన్నట్లైతే, 5 సంవత్సరాలలోపు యజమాని తన భూమి హక్కును కోల్పోతారన్నారు. దీని వల్ల కబ్జాదారులు భూములను ఆక్రమించవచ్చు అన్నారు. కావున ఈ చట్టం రద్దు చేయాలని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

పండుగ కానుకలు రద్దు చేసి పేదవాని పొట్టగొట్టారు : సీపీఐ

బాపట్ల, జనవరి 17: గత ప్రభుత్వ హయాంలో సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ పండుగ రోజుల్లో పేదలకు కానుకలిచ్చే వారని వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని రద్దు చేసి పేదవాని పొట్ట గొట్టిందని సీపీఐ సీనియర్ నాయకులు జేబీ శ్రీధర్ విమర్శించారు. ఈ విషయమై బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం బియ్యం ఉచి తంగా అందిస్తున్న పీడీఎస్ పథకం రాష్ట్ర ప్రభుత్వం జేబులో నుంచి తీసి ఇచ్చినట్లు ప్రచారం చేసుకోవటం సిగ్గుచేటు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విపరీతంగా పెంచిన నిత్యావసర వస్తువుల ధరలతో సామాన్య కుటుంబాలవారు ఆర్థికంగా సతమతమౌతున్నారన్నారు. తుఫాన్, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులు పండుగకు దూరంగా ఉండే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇలాంటి సమయంలో కూడా వారికి ఎటువంటి సాయం చేయకపోవటం సరికాదన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, మున్సిపల్ కార్మికులు, ఆశావర్కర్లు, సమగ్రశిక్ష ఉద్యోగులు నెలలు తరబడి పండుగ అనేది లేకుండా తమ న్యాయమైన కోర్కెల కోసం రోడ్డెక్కి పండుగకు దూరమయ్యారన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజారంజకమైన పాలన సాధ్యం

● జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు

బాపట్ల, జనవరి 17: ప్రజారంజకమైన పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు తెలిపారు. బాపట్ల పట్టణంలో బుధవారం సాయంత్రం కాంగ్రెస్ జిల్లా కమిటీ కార్యవర్గం, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి అంజిబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ కాంగ్రెస్ దెబ్బకు ప్రతిపక్షాలు అబ్బా అనిపిస్తామన్నారు. వైఎస్ షర్మిల సైతం కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిందంటే రాష్ట్ర పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు అన్నారు. ప్రజల వద్దకే పాలన కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూచిన దాడులు, అత్యాచారాలు తప్ప ప్రజలకు అవసరమైన పాలన ఎవరు చేయటంలేదన్నారు. కాంగ్రెస్‌పార్టీని ప్రజలు మరిచిపోయారని బీజేపీ ప్రభు త్వం అందరిని నమ్మిస్తున్నప్పటికి ప్రతి రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారన్నారు. సమావేశంలో జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షుడు పఠాన్ రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దోనేపూడి దేవరాజు, శ్రీపతిప్రకాష్, తాడికొండ వెంకటేశ్వర్లు, తోట శివ, సుబ్బారావు, రంగారావు, దోనేపూడి రవి, శీలం సాగర్, 6 నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజిబాబు

క్రైస్తవులను దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి : చార్వాక

బాపట్ల, జనవరి 17: జిల్లాలోని చీరాల మండలం గవినివారిపాలెం గ్రామంలో పాస్టర్లను దూషించటమే కాకుండా బైబిల్‌ను అవమాన పరుస్తూ విమర్శించిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని అంటరానితన నిర్మూలన పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో వివిధ సంఘాల నాయకులతో కలిసి ఆందోళన చేసిన ఆయన మాట్లాడుతూ అనుచిత వ్యాఖ్యలతో క్రైస్తవుల మనోభావాలు దెబ్బతీసేవిధంగా మాట్లాడిన వ్యక్తిపై చర్యలు తీసుకొని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్రనాయకులు శీలం రోజన్‌బాబు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న డాక్టర్ జి.చార్వాక, శీలం రోజన్‌బాబు తదితరులు

కాపుసంక్షేమ సేన ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయల జయంతి



శ్రీకృష్ణదేవరాయుల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బాలాజి తదితరులు

కర్లపాలెం, జనవరి 17 : శ్రీకృష్ణదేవరాయలు నాడు పరిపాలన కాలంలో సంస్కృతులను కాపాడుతూ ఎన్నో హిందువు దేవాలయాలను నిర్మించి ప్రజానీకానికి పాడి పంటలకు లోటు లేకుండా చేసిన ఘనత ఒక్క శ్రీకృష్ణదేవరాయలుకే దక్కుతుందని కాపు సంక్షేమశాఖ జిల్లా అధ్యక్షుడు మాడసాని బాలాజి అన్నారు. మండలంలోని దమ్మనవారిపాలెంలో బుధవారం కాపు సంక్షేమ సేన ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత శ్రీకృష్ణదేవరాయుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, నరసింహారావు, నాగేశ్వరరావు, జనసైనికులు రాజేష్, శశికిరణ్, మాడసాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణదేవరాయులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాపు సంక్షేమ సంఘ సభ్యులు

● కొల్లూరు, జనవరి 17: శ్రీకృష్ణదేవరాయల జయంతి కాపు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం కొల్లూరులో నియోజకవర్గ కాపు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ దేవ రాయల జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాజుల నగేష్, మండల కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెలివెల బసవరత్తయ్య, సమ్మెట దుర్గాప్రసాద్, ఉప్పు భాస్కర్, బాలాజీ, శ్రీనివాసరావు, గల్లా వెంకటకోటేశ్వరరావు, శిగిలిశెట్టి రాఘవరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జీపీడీపీపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం

పిట్టలవానిపాలెం ,జనవరి 17 : స్థానిక ఎంపీపీ కార్యాలయంలో బుధవా రం ఎంపీడీవో భవనం మారుతిశేషమాంబ అధ్యక్షతన సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీల కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు జీపీడీపీపై రెండురోజుల శిక్షణ కార్యక్రమాన్ని శిక్షకులు గౌస్ రబ్బానీ, జక్రయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రానున్న 2024-2025 సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో 9 అంశాలలో ఏదో ఒక అంశాన్ని బాధ్యతగా తీసుకొని అభివృద్ధి చేసే విధంగా కార్యాచరణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీల కార్యదర్శులు, ఎంపీటీసీలు, గ్రామసర్పంచులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ బీసీలకు పుట్టినిల్లు

● నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ



సమావేశంలో మాట్లాడుతున్న వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జనవరి 17 : తెలుగుదేశంపార్టీ బీసీలకు పుట్టినిల్లు అని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ పేర్కొన్నారు. బాపట్ల టీడీపీ కార్యాలయంలో బుధవారం జయహో బీసీ కార్యక్రమానికి సంబంధించి బీసీనాయకులతో ఆయన సమావేశమయ్యారు. సమావేశంలో నరేంద్రవర్మ మాట్లాడుతూ ఒక్క అవకాశమని అడిగి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి బీసీలకు తీరని అన్యాయం చేశారన్నారు. సరైన ఆర్థిక ప్రణాళిక లేకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థని అతలాకుతలం చేసి బీసీలకు ఉపాధి అవకాశాలు, అభివృద్ధి లేకుండా చేశారన్నారు. బీసీలకు వెన్నుదన్నుగా నిలిచిన పార్టీ తెలుగుదేశం అన్నారు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా బీసీలకు రక్షణ చట్టం తెచ్చి వారికి అన్నివిధాల అండగా నిలవాలని తెలుగుదేశంపార్టీ నిర్ణయించుకుందన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ టీడీపీ పాలనలో విదేశాలలో చదువుకునే పేద విద్యార్థుల కలలను నెరవేరుస్తూ ప్రతి విద్యార్థికి 10లక్షల సహాయం చేశారన్నారు. కులవృత్తులు చేసుకునేవారికి 90శాతం సబ్సిడీతో పనిముట్లు అందించారన్నారు. తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు టీటీడీ ఛైర్మన్ లాంటి గౌరవప్రదమైన పదవులు బీసీలకు ఇస్తే ఇప్పుడు 90శాతం నామినేటెడ్ పదవులు ముఖ్యమంత్రి సామాజికవర్గానికి ఇచ్చారన్నారు. సమావేశంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు తోట నారాయ ణ, మునేశ్వరరావు, శేఖర్, ఉప్పాల కృష్ణగౌడ్, కర్పూరపు రామారావు, పరిశా రమేష్‌గౌడ్, వెంకటేశ్వరరావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నరేంద్రవర్మ వెంటే ఉంటాం.. స్టూవర్టుపురం యువత

బాపట్ల, జనవరి 17 : టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ వెంటే ఉంటామని స్టూవర్టుపురం గ్రామానికి చెందిన యువత స్పష్టం చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నరేంద్రవర్మను కలిసి సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. రాబోయే ఎన్నికల్లో నరేంద్రవర్మకు మద్దతుగా పని చేస్తామని స్పష్టం చేశారు. అండగా నిలబడుతామని హామీ నిచ్చారు. కార్యక్రమంలో గ్రామయువకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

● అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి మేకల ప్రసాద్



బాపట్ల ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

బాపట్ల, జనవరి 17 : అంగన్‌వాడీల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి మేకల ప్రసాద్ డిమాండ్ చేశారు. 37 రోజులుగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న ఆందోళన కార్యక్రమానికి బుధవారం బహుజన సమాజ్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొచ్చెర వినయ్‌రాజుతో కలిసి ఆయన సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల ఉద్యమంపై పాలకులు స్పందించకుండా అణగదొక్కే ప్రయత్నం చేయటం సరికాదన్నారు. రాష్ట్రప్రభుత్వం మొండివైఖరి విడనాడి న్యాయమైన వారి కోర్కెలను తీర్చాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు వెలగా శైలశ్రీ, సీతామహాలక్ష్మి, పద్మ, పార్వతి, భారతి, గీత పాల్గొన్నారు.

● రేపల్లె, జనవరి 17: ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల రాష్ట్రం, కేంద్రంలో నిరవధిక దీక్షలు చెయ్యాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఏపీ అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అధ్యక్షులు కె.రూసీ అన్నారు. బుధవారం అంగన్‌వాడీలు, సీఐటీయూల ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె 37వరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సల హాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి విధుల్లోకి చేరకపోతే తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. అంగన్‌వాడీల బెదిరింపులకు గురిచేస్తే రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదన్నారు. ప్రభుత్వం వారిని వెంటనే చర్చల కు పిలిచి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నిర్మలా జ్యోతి, ఎం కృష్ణకుమారి, డి.జ్యోతి, శివలక్ష్మి, అరుణ పాల్గొన్నారు.



సీడీపీవో కార్యాలయంలో షోకాజ్ నోటీసులకు వివరణ తెలియపరుస్తున్న అంగన్‌వాడీలు

సామాజిక సమతా సంకల్పం ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్



జిల్లా స్థాయి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల, జనవరి 17 : సామాజిక సమత సంకల్పం మారథాన్, మానవహారం కార్యక్రమం బాపట్లలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాల నిర్వాహణపై కమిటీలోని జిల్లా స్థాయి అధికారులతో బుధవారం ఆయన ఛాంబర్‌లో సమీక్షించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం అవిష్కరణలో భాగంగా జిల్లా సాంఘిక సంక్షేమశాఖా ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించాలని కలెక్టర్ చెప్పారు. ఈనెల 18వ తేది గురువారం ఉదయం 9గంటలకు మున్సిపల్ హైస్కూల్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించాలని తదుపరి సూర్యలంకరోడ్డులోని వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో వేడుకలు జరుగుతాయన్నారు. జిల్లా స్థాయిలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు విరివిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల భాగస్వామి ఉండాలన్నారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు సచివాలయాల ద్వారా వేల సంఖ్యలో ప్రజలు తమ పేర్లు నమో దు చేసుకున్నారని ఆయన తెలిపారు. ముందస్తు పేర్లు నమోదు చేసుకున్న వారంతా సురక్షితంగా విజయవాడ వెళ్లటానికి ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సీహెచ్.శ్రీధర్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి జె.రాజాదెబోరా, డీఈవో పివిజె.రామారావు, డీఆర్‌డీఏ పీడీ కృష్ణ, జిల్లా వైద్యఆరోగ్యశాఖా అధికారి డాక్టర్ విజయమ్మ, మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్ పాల్గొన్నారు.

19 నుంచి కులగణన సర్వే

బాపట్ల, జనవరి 17: కులగణన సర్వే కార్యక్రమం ఈనెల 19వ తేదీ నుంచి 29వ తేదీ వరకు జరుగుతుందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. జాయింట్ కలెక్టర్ శ్రీధర్‌తో కలిసి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిర్వాహణపై జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులతో బుధవారం ఆయన కాన్ఫరెన్స్ నిర్వహించారు. కులగణన సర్వే జిల్లాలో సమర్థంగా నిర్వహించాలని సంబంధితాధికారులను కలెక్టర్ ఆదేశించారు ఏదేని కారణంతో మిగిలిపోయిన కుటుంబాల సర్వే ఫిబ్రవరి 2వతేదీ వరకు సాగుతుందన్నారు. అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

కర్లపాలెంలో ఫ్లెక్సీలు తొలగింపు

కర్లపాలెం, జనవరి 17: కర్లపాలెం సెంటర్లో ఏర్పాటు చేసిన పలు ఫ్లెక్సీల ను ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు కర్లపాలెం పంచాయతీ కార్యదర్శి మోడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బందితో ఫ్లెక్సీలు అన్నిటిని తొలిగిస్తున్నామని కర్లపాలెం ఎస్ఐ శివయ్య తెలిపారు.

26 నూతన చర్చి ప్రారంభం

పిట్టలవానిపాలెం, జనవరి 17: మండలంలోని అల్లూరు గ్రామపంచాయతీలోని నత్తలవారిపాలెం గ్రామంలో ఈనెల 26న నూతనంగా నిర్మించిన లూథరన్ చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేయాలని బాపట్ల నియో జకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మను నత్తలవారిపాలెం గ్రామపెద్దలు ఆహ్వాన పత్రిక అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కర్లపాలెం, జనవరి 17: కర్లపాలెం మండలం గణపవరం గ్రామం 1997 సంవత్సరం 10వ తరగతి పూర్వవిద్యార్థుల సమ్మేళనం కర్లపాలెం పీకేఆర్ ప్లాట్స్‌లో ఘనంగా బుధవారం నిర్వహించారు. 26 సంవత్సరాల హైస్కూల్ జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. పూర్వవిద్యార్థులలో చనిపోయిన వారికి నివాళి అర్పించారు. ఉపాధ్యాయులు మంతెన సత్యనారాయణ రాజు, గాయత్రి తదితర ఉపాధ్యాయులను శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాగభైరవ ఆనంద్, పి.నరేంద్ర, పాలపర్తి గోవిందు, రావూరి చిరంజీవి, అన్న వరపు కామేశ్వరరావు, యారం చిన్నఅబ్బాయి, పి.శ్రీహరి, మార్పు సుందరరావు, కత్తి రమేష్, రాజు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వెంకటేశ్వర్లు, రజని

కర్లపాలెం, జనవరి 17: మండలంలోని నల్లమోతువారిపాలెంలో విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ము గ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన మహిళలకు వారికి బహుమతులను బుధవారం అందజేశారు. అంతేకాకుండా కన్సోలేషన్ బహుమతులు రెండు చొప్పున ఎంపిక చేసి వారికి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బెజవాడ వెంకటేశ్వర్లు, బండ్రెడ్డి రజని, గృహలక్ష్మి, యేమినేని శంకరస్వామి, పిట్టు వెంకటేశ్వరరెడ్డి, గ్రంధి నాగేంద్రరావు, మద్దుల వెంకటేశ్వర్లు, గ్రామపెద్దలు, దాతలు తదితరు లు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి

వేమూరు, జనవరి 17: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతిని గురువారం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వ హించాలని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనంద బాబు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులర్పించాలని ఆయన కోరారు.

రైతులు శాస్త్రవేత్తల సూచనలను పాటించాలి

● ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

బాపట్ల, జనవరి 17: రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని ఏరు వాక కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. బాపట్ల మండలం మరుప్రోలువారిపా లెం, ముత్తాయపాలెం, ఆసోదివారిపాలెం గ్రామాల్లో బుధవారం వ్యవసాయాధికారులతో కలిసి శాస్త్రవేత్తలు పొలాలను సందర్శించారు. మొక్కజొన్న, వేరుశనగ పైర్లను పరిశీలించి సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. మొక్కజొన్నలు కత్తెర పురుగు ఉంది కావున మందులు పిచికారి చేయకుండా ప్రతి మొక్క మొవ్వులో పడేవిధంగా వేయాలని చెప్పారు. వేరుశనగలో జింకు, ఐరన్‌లోపం ఉంది కావున జింకు లోపం నివారణకు చెలామిన్ పిచికారి చేసుకోవాలన్నారు. ఐరన్ లోప నివారణకు చెలాఫర్ పిచికారి చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు ఓబయ్య, రాధాకృష్ణ, డీఆర్‌సీ డీడీఏ విజయనిర్మల, ఏడీఏ ఎ.లక్ష్మీ, వ్యవసాయాధికారి చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

సినిమా హాల్లో దాడిలో ఒకరిపై కేసు నమోదు

కొల్లూరు, జనవరి 17 : సినిమా హాల్లో సీట్ల వివాదంలో జరిగిన దాడి ఘటనలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజ్యలక్ష్మి బుధవారం తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 15వ తేదీ రాత్రి కొల్లూరులోని ఓ సినిమా హాల్లో సీట్ల వివాదం జరిగిన క్రమంలో కాశికృష్ణ అనే యువకుడు 15 మంది యువకులను తీసుకువచ్చి సుగ్గునలంకకు చెందిన వారిపై దాడి చేసినట్లు ఫిర్యాదు అందడంతో అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అతనితో పాటు దాడిలో పాల్గొన్న వారి వివరాలు తెలుసుకుని వారిపై కూడా కేసులు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

కొల్లూరు, జనవరి 17: పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాజ్యలక్ష్మి తెలిపారు. బుధవారం కొల్లూరు గౌడపాలెం వద్ద మాగాణి పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడం తో ఎస్ఐ సిబ్బందితో పేకాట స్థావరంపై ఆకస్మిక దాడి చేశారు. దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.8750 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. జూదరులను కోర్టులో హాజ రు పరచనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

భట్టిప్రోలు, జనవరి 17 : రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహన చోదకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పేటేరు గ్రామానికి చెందిన కుటుంబరావు బుధవారం ద్విచక్రవాహనంపై మధ్యాహ్నం ఓలేరు వచ్చి తిరి గి పేటేరు వెళ్తున్నాడు. 216 జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా భట్టిప్రోలు నుంచి రేపల్లె వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. ద్విచక్రవాహనంపై ఉన్న కుటుంబరావు ఎగిరి రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయమైంది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కుటుంబరావును రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తెనాలి ప్రభుత్వాసుపత్రికి పంపించారు.



టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావటం ఖాయం

చెరుకుపల్లి, జనవరి 17: అధికార పార్టీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన 2024లో టీడీపీ జనసేన సంయుక్త ప్రభుత్వం రావటం ఖాయమని ఎమ్మెల్యే అనగాని సత్యప్ర సాద్ అన్నారు. బుధవారం చెరుకుపల్లి ఎస్సీ కాలనీకి చెంది న వైసీపీ నాయకులు పెద్దపల్లి వీరాకృష్ణ, అనిత, రాజేష్, కుమారి, బడుగు శ్యామ్యూల్, నాదెండ్ల ఏసుబాబు, శైలజ, బడుగు సమర్పణరావు, పెదపల్లి శివకృష్ణ, రాజారావు, భాగ్య లక్ష్మి, శివమణి, వంశీ, మరియమ్మలకు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం 30సంవత్సరాలు వెనక్కి వెళ్ళిందని ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలకు పావలా ఇచ్చి వైసీపీ నాయకులు రూపాయి దోచుకు తింటున్నారన్నారు. రాష్ట్రం ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవ్వటంతో పాటు లక్షల కోట్ల రూపాయలు దివాలా తీసిందన్నారు. భావితరాల భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి కార్యకర్త టీడీపీకి అండగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మల్లాది రామకృష్ణ, చెరుకుపల్లి టౌన్ అధ్యక్షుడు నాగుల పున్నారావు, ఎంఆర్‌కే మూర్తి, పూషడపు కుమారస్వామి, దివి రాంబాబు, వీరంకి వెంకటశివ, దివి శ్రీనివాసరావు, కందుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలి

రేపల్లె, జనవరి 17: మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 19వ వర్ధంతి సందర్భంగా ఈనెల 24న మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిటాల యువసేన, ఎన్టీఆర్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 24న వర్ధంతిని పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారని, నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో దండమూడి ధరణికుమార్, జీవీ నాగేశ్వరరా వు, దేవగిరి రవి, గుడారంకయ్య, కె.రాము పాల్గొన్నారు.

21న అంతర్జాతీయ ప్రధాన సూఫీ పీఠాధిపతులు సదస్సు

● ఏపీబీ ఎస్‌టీపీ దర్బార్ ఫౌండర్

వేమూరు, జనవరి 17 : బాపట్ల జిల్లా వేమూరు మండలం జంపని గ్రామంలో ఈనెల 21వ తేదిన అంతర్జాతీయ స్థాయిలో ప్రధాన సూఫీ పీఠాధిపతుల సదస్సు నిర్వహించనున్నట్లు ఏపీబీ ఎస్‌టీపీ దర్బార్ ఫౌండర్ అతమహమ్మద్ నిజాముద్దీన్ తెలిపారు. బుధవారం ఆయన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ జంపనిలో గౌసియా చమన్ ఆస్థాన హతాయబాగ్ ఏ సర్కార్ తాజుల్ ఔలియా దర్బార్లో సదస్సు జరుగుతుందన్నారు. హజ్రత్ సూఫీ మహమ్మద్ అతావుల్లా షరీఫ్ శాతాజ్ ఖాతరి బాగ్దాది బాబా చీమలపాడు షరీఫ్ వారి దివ్య ఆశీస్సులతో లోకక్షేమం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ముందుగా పతాక ఆవిష్కరణ జరిపి అనంతరం ప్రత్యేక ప్రార్థనతో సదస్సును ప్రారంభిస్తారు. ఇరాక్ దేశానికి చెందిన బాగ్దాద్ షరీఫ్ బడేపీర్ సర్కార్ వంశీకులు ముఖ్య అతిధిగా పాల్గొని అనుగ్రహ భాషణం చేస్తారని పేర్కొన్నారు. భారతదేశం నలుమూలల నుండి బాబావారి భక్తులు వేలాదిగా తరలివచ్చి బడేషీర్ మహాత్ముల వంశీకుల ప్రవచనాలను విని దువా కార్యక్రమాల్లో పాల్గొని అల్లా అనుగ్రహాన్ని పొందాలని కోరారు. ఈ సందర్భంగా కుల మతాలకు అతీతంగా వేలా మందికి అన్నదానం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వెల్లటూరులో టీడీపీ ఫ్లెక్సీ కోసిన దుండగులు



ప్రధాన కూడలిలో కోసి వేసిన టీడీపీ ఫ్లెక్సీ

భట్టిప్రోలు, జనవరి 17: మండలంలోని వెల్లటూరులో ప్రధాన కూడలిలో టీడీపీ నాయకులు ఫ్లెక్సీని ఏర్పాటు చేశా రు. ప్రజలకు నూతన సంవత్సర, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ మాజీ మంత్రి నక్కా ఆనందబాబుతో పాటుగా స్థాని క నాయకుల ఫొటోలతో నిలువెత్తు ఫ్లెక్సీని పెట్టారు. మంగళవారం రాత్రి దుండగులు దానిని కోసివేశారు. ఫ్లెక్సీలు కోసివేయడం, చింపివేసే సంస్కృతి మంచి పద్ధతి కాదని టీడీపీ గ్రామ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రేపు మోదుకూరులో వేమన జయంతి మహోత్సవాలు

చుండూరు, జనవరి 14: వేమన జయంతి మహోత్సవాలను మోదుకూరులో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ తెలిపింది. విజయవాడ ఆంధ్రా లయోల కళాశాల, మోదుకూరు వేమన జయంతి ఉత్సవ కమిటీ సంయుక్త నిర్వహణలో ఈ జయంతి నిర్వహిస్తున్నారు. గ్రామంలోని వేమన సాహిత్య వికాస్ భవన్‌లో జరిగే ఈ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ సెర్ప్ సీఈవో ఏఎంజీ ఇంతియాజ్ పాల్గొననున్నారు. ఆంధ్ర లయోల కళాశాల ప్రాచ్యాత్యులు ఆచార్య గుజ్జుల ఆంటోని పీటర్ కిషోర్, రాష్ట్ర ప్రభుత్వ బీసీడీఈ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ ఎంఎల్ఎస్ దేవకుమార్, హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం భాషా అనువాద శాస్త్రాల అధ్యయన కేంద్రం విశ్రాంత ఆచార్యులు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి వ్యవస్థాపకులు గోళ్ళ నారాయణరావు, అమ్మనుడి సంపాదకులు డాక్టర్ సామల రమేష్‌బాబు పాల్గొంటారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా సూర్యనారాయణమూర్తి



సూర్యనారాయణమూర్తి

వేమూరు, జనవరి 17: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా జం పని గ్రామానికి చెందిన పాములపాటి సూర్యనారాయణ మూర్తి నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఘంటా అంజిబాబు చేతుల మీదుగా బుధవారం ఆయన బాపట్లలోని పార్టీ కారాయలయంలో నియామక పత్రాన్ని అందుకున్నారు. ఇప్పటివర కు సూర్యనారాయణమూర్తి వైసీపీలో పని చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజావ్యతిరేక విధానాలతో పాలన సాగిస్తున్నాడు అన్న ఆలోచనతో పార్టీని విడనాడి కాంగ్రెస్ పార్టీ తీర్థాన్ని పుచ్చుకున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తాడికొండ వెంకటేశ్వరరావు సిఫార్సు మేరకు కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం సూచన మేరకు సూర్యనారాయణ మూర్తికి పార్టీ మండల అధ్యక్ష పదవిని కట్టబెట్టారు.

ఆలపాడులో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, బీజేపీ నాయకులు

చుండూరు, జనవరి 17: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున వివిధ పథకాల ద్వారా చేయూత నందిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి తెలిపారు. బుధవారం ఆలపాడులో జరిగిన వికసిత్ సంకల్ప యాత్రలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్, జనధన్ యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాని ఉజ్వల్ యోజన, పీఎం ముద్రయోజన ఇలా 23 పథకాలను కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అందిస్తుందని తెలిపారు. ఎంపీడీవో సుగుణమ్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, దీనిని పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉపయోగించుకోవాలని తెలిపారు. తహసీల్దార్ కనకదుర్గ, సర్పంచ్ గద్దే విజయలక్ష్మీ, ఈవోపీఆర్‌డీ కుమారస్వామి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి గ్రామస్థులకు వివరించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎం జగన్నాధం, పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరరావు, మండల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు, పక్కన డిప్యూటీ కలెక్టర్ రమేష్ నాయుడు

సమాజ చైతన్యంలో నాటక రంగ పాత్ర కీలకం

● ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

వీరన్నపాలెం(పర్చూరు), జనవరి 17: సమాజ చైతన్యంలో నాటక రంగ పాత్ర కీలకమని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరు మండలం వీరన్న పాలెం గ్రామంలో కళానికేతన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయస్థాయి నాటక పోటీలు మంగళవారం రాత్రితో ముగిశాయి. పోటీల ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో పాటు, డిప్యూటీ కలెక్టర్ కఠారి రమేష్ నాయుడు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఏలూరి మాట్లాడుతూ కళలను, కళారంగాన్ని పోత్సహించాలన్న సంకల్పంతో వ్యయ ప్రయాసలను ఓర్చి గ్రామీణ ప్రాంతంలో జాతీయస్థాయిలో నాటిక పోటీలను ఏర్పాటు చేయటం హర్షించదగ్గ విషయం అని అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా గ్రామస్థులు కలసి కట్టుగా ఇలాంటి పోటీలను ఏర్పాటు చేయటం సంతోషదాయకం అన్నారు. డిప్యూటీ కలెక్టర్ కఠారి రమేష్ నాయుడు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న సంఘటనలను కళాకారులు తమ కళాప్రదర్శన ద్వారా కళ్ళకు కట్టినట్లు చూపటం ఇందుకు నిదర్శనమన్నారు. అనంతరం నాలుగు రోజుల నుంచి నిర్వహించిన నాటిక పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో కొల్లా శివరాంప్రసాద్, గోరంట్ల రమేష్, రజని, చిట్టినేని సాయిబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టినేని రామకృష్ణ, కొల్లా శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.



ద్రోణాదుల చెరువులో స్వామి వారి తెప్పోత్సవం (ఇన్‌సెట్లో) విద్యుత్ వెలుగుల్లో ప్రభ

ద్రోణాదులలో పండుగ కోలాహలం

● వైభవంగా స్వామి వారి తెప్పోత్సవం

● విద్యుత్ ప్రభలు.. సాంస్కృతిక కార్యక్రమాలు

మార్టూరు, జనవరి 17: సంక్రాంతి పండుగ కనుమ మరుసటి రోజు మండలంలోని ద్రోణాదుల గ్రామంలో తిరునాళ్ల సందడి కనిపించింది. ఇతర ప్రాంతాలకు, పట్టణాలకు వెళ్లిన వారు సంక్రాంతి పండుగకు ఇంటికి వచ్చారంటే తప్పని సరిగా ఈ తిరునాళ్ల రోజు వరకు సందడి చేసి వెళుతుంటారు. అదేవిధంగా బుధవారం ఈ గ్రామంలో సంక్రాంతి సందడి ప్రతి ఇంట కనిపించింది. మధ్యాహ్నం గ్రామంలోని కోదండరామస్వామి, వీరభద్రస్వామి, సోమేశ్వరస్వామి దేవస్థానంలోని ఉత్సవ విగ్రహాలకు పూజా కార్యక్రమాలను నిర్వహించి ఆలయ అర్చకులు నగరోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రజలందరూ వెంట రాగా మచ్చ కుంట చెరువులో స్వామి వారి విగ్రహాలతో తెప్పోత్సవం చేశారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి గ్రామస్థులతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల వాసులు కూడా రావడం విశేషం. సాయంత్రం ప్రధాన సెంటర్‌లో చేసిన కోలాటం, భజన కార్యక్రమాలను ప్రజలు ఆశేషంగా తిలకించారు. గ్రామంలోని బొబ్బేపల్లి రోడ్‌లో, ప్రధాన సెంటరులో ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ ప్రభలు అలరించాయి. గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



మహిళా న్యాయవాది చిట్టాబత్తిన ఫణీంద్రాదేవి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

ఫణీంద్రాదేవికి నివాళులు అర్పించిన కరణం

అద్దంకి, జనవరి17: మహిళాన్యాయవాది చిట్టాబత్తిన ఫణీంద్రాదేవికి పలువురు నివాళులు అర్పించారు. ఫణీంద్రాదేవి మంగళవారం విజయవాడలోని వైద్యశాలలో మృతి చెందగా బుధవారం అద్దంకిలో అంత్యక్రియలు జరిగాయి. చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి బుధవారం ఉదయం ఫణీంద్రాదేవి మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఫణీంద్రాదేవి భర్త కనకసేనరావుతో ఉన్న సంబంధాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. టీడీపీ బాపట్ల జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు బత్తుల రామకోటయ్య, బొడ్డపాటి రవికుమార్,పెంట్యాల గంగాధర్, అడుసుమల్లి కిషోర్, కూరపాటి రామకోటేశ్వరరావు తదితరులు నివాళులు అర్పించారు. అద్దంకి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ హాల్‌లో ఫణీంద్రాదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, సుభాష్ బాబు, వీరనారాయణ, పీఎల్ఎన్ ప్రసాద్, వెంకటరావు, ఉదయభాస్కర్, హరిబాబు, మహిళా న్యాయవాదులు గృహలక్ష్మి, నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

దూషించిన వ్యక్తుల అరెస్ట్

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జనవరి 17 : ఏసు క్రీస్తు పుట్టుకను అవహేళన చేస్తూ దూషణకు పాల్పడిన ఇరువురిని ఎట్టకేలకు ఈపూరుపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. చీరాల మండల పరిధిలోని గవినివారిపాలెంకు చెందిన మిండా వెంకటరావు, గవిని అయ్యప్ప సువార్త ప్రకటిస్తున్న వారి మధ్యలోకి చొరబడి క్రీస్తు పుట్టుకను దూషించారు. దీంతో ఆగ్రహించిన క్రైస్తవులు మంగళవారం ఉదయం స్టేషన్ ముందు రాత్రి సమయంలో 216 జాతీయ రహదారి ఈపూరుపాలెం వద్ద సుమారు గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. అయితే నిందితులను పట్టుకునేందుకు బుధవారం ఉదయం వరకు పోలీసులు గడువు కోరారు. ఈనేపథ్యంలో పోలీసులు గాలింపు చర్యలు వేగవంతం చేసి బుధవారం ఉదయానికి వారిని పట్టుకున్నారు. దీంతో పరిస్థితులు చక్కబడ్డాయి. అయితే పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన పలువురు ఎస్సీ సామాజికవర్గంపై కూడా కేసులు నమోదయ్యాయి. వీటిపై పోలీసులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

నేడు సెయింట్‌ఆన్స్‌లో క్యాంపస్ ఇంటర్వ్యూలు

చీరాల, జనవరి 17 : సెయింట్‌ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో డిప్లమా 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వాల్యూఫ్రిక్షన్ మెటీరియల్ ఇండియా కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావులు బుధవారం తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

భవనాసి రిజర్వాయర్ పర్యాటక కేంద్రంగా మారేనా?

జరగని భూసేకరణ పనులు

అభివృద్ధి చేయలేదని వైసీపీపై భక్తుల పెదవివిరుపు

అద్దంకి, జనవరి 17: రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న ప్రసిద్ధ దేవాలయాలలో అద్దంకి మండలంలోని శింగరకొండ కూడా ఒకటి. శింగరకొండ వద్ద ఉన్న భవనాసి చెరువు కు వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. 2009 లో భవనాసి చెరువును రిజర్వాయర్‌గా మార్చే పనులు ప్రారంభమయ్యాయి. నిర్మాణ పనులు అత్యధిక శాతం పూర్తయినప్పటికీ భూసేకరణ పనులు జరగకపోవటంతో ఇంకా పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాలేదు. శింగరకొండలో కూడా దశాబ్దన్నర కాలంలో దాతల సహకారంతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగాయి. అయితే భవనాసి రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే పనులకు మాత్రం అంకురార్పణ జరగలేదు. భవనాసి రిజర్వాయర్ మధ్యలో ఐ ల్యాండ్ ఏర్పాటు చేసి ఎత్తైన ఆంజనేయస్వామి లేదా బుద్ధుడి విగ్రహం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు వచ్చాయి. అదే సమయంలో భవనాసి రిజర్వాయర్ విశాలంగా ఉన్నందున బోట్ షికారుకు కూడా ఏర్పాటు చేసే అవకాశం ఉంది. బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాలతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో శింగరకొండ కు వస్తుంటారు. శింగరకొండ వచ్చిన భక్తులు రోజంతా హాయిగా గడిపేందుకు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. భక్తులు కుటుంబసభ్యులతో వచ్చినా దేవాలయం గదులతో పాటు అన్ని సామాజిక వర్గాల అన్నదాన సత్రాలు, గదులు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. కనీసం ప్రవేటు భాగస్వామ్యంతో బోటు షికారు ఏర్పాటు చేసినా కొంత మేర అభివృద్ధికి అవకాశం ఉంటుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు. వైసీపీలో కీలక పదవిలో మేదరమెట్లకు చెందిన వైవీ సుబ్బారెడ్డి ఉండటంతో భవనాసి రిజర్వాయర్ టూరిజం సెంటర్‌గా అభివృద్ధి చెందుతుందని పలువురు భావించినప్పటికీ పుణ్యకాలం మొత్తం పూర్తయ్యిందని భక్తులు పెద్దవి విరుస్తున్నారు.



రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసిన భవనాసి చెరువు (ఇన్‌సెట్లో) శింగరకొండ వ్యూ



అనంతవరం గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

సంప్రదాయాలను గౌరవించాలి

అనంతవరంలో మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు

యద్దనపూడి, (మార్టూరు) జనవరి 17: సంక్రాంతి పండుగ సంప్రదాయాలను తప్పని సరిగా పాటించాలని, ఆహ్లాదకరమైన వాతావరణంలో అందరూ పండుగను జరుపుకోవాలని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని అనంతవరం గ్రామంలో టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి పుల్లారావు, టీడీపీ బాపట్ల పార్ల మెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావులు పాల్గన్నారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటే కుటుంబం అంతా కలిసి మెలిసి ఆనందంగా గడిపే రోజు అన్నారు. ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో సంక్రాంతి పండుగ ఆనందాన్ని నింపాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. వచ్చే సంక్రాంతి నాటికి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజలందరూ సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో చంద్రబాబు సారధ్యంలో సరి కొత్తగా మేనిఫెస్టోను ప్రకటించారన్నారు. రాబోయే కాలంలో ఏటా సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోవాలంటే మళ్లీ చంద్రబాబును ముఖ్య మంత్రిగా చేయడమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు గుదే తారక రామారావు, నిమ్మల సాంబశివరావు, కోయ సతీష్, కొరటాల వంశీ, పెదవల్లి కల్యాణ చక్రవర్తి, పెదవల్లి వెంకటేశ్వర్లు, సుబ్బారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న ప్రైవేట్ బస్సు

● మార్టూరు సీఐకు తీవ్ర గాయాలు

● కారు డ్రైవరుకు స్వల్పగాయాలు

● నాయుడుపేట మండలం గుర్రప్పతోట వద్ద ప్రమాదం

మార్టూరు, జనవరి 17: అనంతపురం జిల్లాలో మంగళవారం జరిగిన ప్రధానమంత్రి మోదీ సభకు బందోబస్తుకు వెళ్లివస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మార్టూరు సీఐ అక్కేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. కారు డ్రైవరు సర్దార్ అనే యువకుడు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం తిరుపతి జిల్లా నాయుడుపేట సమీపంలోని పెళ్లకూరు మండలం గుర్రప్పతోట గ్రామం సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. ప్రధానమంత్రి సభ కార్యక్రమంలో బందోబస్తు ముగించుకొని మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో ఇన్నోవా కారులో మార్టూరుకు బయలుదేరిన సీఐ వాహనాన్ని ఎదురుగా ప్రయివేటు ట్రావెల్ బస్సు ఢీ కొన్నది. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దెబ్బతినగా, కారులో ఉన్న సీఐ, కారు డ్రైవరు గాయాలకు గురయ్యారు. ఈ ప్రమాదంలో సీఐ ఎడమకాలు, కుడి చేతికి గాయాలయ్యాయి. అనంతరం ఈ ప్రమాదంలో గాయపడిన వారిద్దరిని నెల్లూరులోని అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. తరువాత మార్టూరు ఎస్సై ఎం. శ్రీనివాసరావు అపోలో ఆస్పత్రికి వెళ్లి వారిని పరామర్శించి వైద్యులతో మాట్లాడారు. ప్రధానమంత్రి సభకు మార్టూరు స్టేషన్ నుంచి సీఐతో పాటు ఏఎస్ఐ బాషా, ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక హోం గార్డు బందోబస్తు నిమిత్తం వెళ్లారు.

కలవరపాటులో పోలీసులు

బందో బస్తుకు వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో సీఐ అక్కేశ్వరరావు గాయపడిన విషయం తెలియగానే మార్టూరు స్టేషన్‌లో పోలీసులు కలవరపాటుకు గురయ్యారు. వెంటనే ఎస్సై ఎం. శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి నెల్లూరు లోని అపోలో హాస్పిటల్‌కు వెళ్లారు. అదేవిధంగా స్టేషన్‌లోని మిగిలిన సిబ్బంది కూడా సీఐ ప్రమాదానికి గురయ్యారని ఆందోళనకు గురయ్యారు. రెండు నెలలు క్రితం సీఐగా అక్కేశ్వరరావు జాయిన్ అయ్యారు. అంతకు ముందు సీఐగా పని చేసిన ఫిరోజ్‌తో పాటు ఎస్సై కె. కమలాకర్, యద్దనపూడి ఎస్సై అనూక్, పర్చూరు ఎస్సై ప్రసాద్‌లు ఫాం 7 ఓట్లకు సంబందించిన ఎన్నికల నిబంధనను అతిక్రమించారనే కారణంగా పోలీసు ఉన్నత అధికారులు వారిని సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఈ సంఘటన జరిగిన తర్వాత కొత్త సీఐగా అక్కేశ్వరరావు, ఎస్సైగా శ్రీనివాసరావు జాయిన్ అయ్యారు. ఇపుడు సీఐ రోడ్డు ప్రమాదానికి గురవడంతో స్టేషన్ సిబ్బంది ఉలిక్కి పడుతున్నారు.



నాయుడుపేట సమీపంలోని గుర్రప్పతోట వద్ద కారును ఢీకొన్న ప్రైవేట్ బస్సు (ఇన్‌సెట్లో) తీవ్రంగా గాయపడి కారులో చిక్కుకుపోయిన సీఐ అక్కేశ్వరరావు

ఎన్నికల్లో కలసికట్టుగా పనిచేద్దాం..

వైసీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

చీరాల, జనవరి 17 : ' జనం గుండెల్లో ఉన్నాం.. విజయం మనదే.. వచ్చే ఎన్నికల్లో కలసికట్టుగా పనిచేద్దాం.. భావసారూప్యం ఉన్న అందరిని కలుపుకుపోదాం'.. అని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. ఒంగోలులోని వారి నివాసంలో చీరాల నియోజకవర్గ వైసీపీ ముఖ్య నాయకులతో వెంకటేష్ కొలుకున్న అనంతరం తొలిసారిగా బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరాం మాట్లాడుతూ వెంకటేష్ బాధ్యత నాది, నాకు అప్పగించండి, అన్నీ నేను చూసుకుంటానని సీఎం జగన్ చెప్పారు. అతన్ని గెలిపించుకోవటం మనందరి బాధ్యత అన్నారు. వెంకటేష్ మాట్లాడుతూ తమను చీరాల నియోజకవర్గ ప్రజలు ఆదరించిన, ఆదరిస్తున్న తీరును ఎన్నటికి మర్చిపోలేమన్నారు. 22వ తేదీ సాధికారబస్సు యాత్రను విజయవంతంగా నిర్వహించటంపై పలు సూచనలు చేశారు. సలహాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు చీరాల నియోజకరవ్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

కలసి నడుద్దాం .. కలుపుకొని పోదాం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండయ్య

చీరాల, జనవరి 17 : టీడీపీలో రోజు, రోజుకు చేరికలు పెరుగుతున్నాయి. కలసి నడుద్దాం. అందరిని కలుపుకు పోదామని ఆ పార్టీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.ఎం కొండయ్య అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో కొండయ్య సమక్షంలో వాడరేవుకు చెందిన ధోని కనకరాజు ఆధ్వర్యంలో పలువురు మత్స్యకారులు బుధవారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కొండయ్య వారికి టీడీపీ కండువాలువేసి పార్టీలోకి ఆహ్వానించారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి భవిష్యత్ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సలగల రాజశేఖర బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో నెల కొన్న అరాచకాలను వివరించారు. కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నాశిక వీరభద్రయ్య, నాయకులు బుద్ధి బస్వాచారి, కూరపాటి పూర్ణ, కౌతవరపు జనార్ధనరావు, గుర్రం మల్లేశ్వరరావు, కర్పూరపు సుబ్బలక్ష్మి, యర్రా శివనాగమల్లేశ్వరి, తెలప్రోలు నాగేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొండయ్యకు మద్దతు తెలుపుతున్న వాడరేవుకు చెందిన మత్స్యకారులు

కొత్త వ్యక్తుల సంచారంపై అప్రమత్తంగా ఉండాలి

వేమవరంలో పోలీస్ పికెట్‌ను తనిఖీ చేసిన సీఐ

బల్లికురవ. జనవరి 17 : సార్వత్రిక ఎన్నికలు దగ్గరలో ఉన్నాయని, గ్రామాలలో కొత్త వ్యక్తులు ప్రవేశించి అలజడులు సృష్టించే ప్రమాదం ఉందని, పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సంతమాగులూరు సర్కిల్ సీఐ నరసింహారావు సూచించారు. బుధవారం రాత్రి ఫ్యాక్షన్ గ్రామం అయిన వేమవరాన్ని సీఐ పరిశీలించారు. అనంతరం అక్కడ గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న పోలీస్ పికెట్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో మద్యం అమ్మకాలు చేపట్టినా, జూదం నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ప్రజలు ప్రశాంతంగా ఉండాలన్నారు. ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెంచుతామన్నారు. అలానే గ్రామాలలో రోడ్ల వెంబడి పెట్రోల్ అమ్మకాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. అలానే గ్రానైట్, మెటల్ క్వారీలలో బ్లాస్టింగ్‌లు అనుమతులు లేకుండా చేపడితే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. అనంతరం బల్లికురవ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ తనిఖీలో ఎస్ఐ వి. వేమన పాల్గొన్నారు.



పోలీస్ పికెట్‌ను తనిఖీ చేస్తున్న సీఐ నరసింహారావు



పర్చూరు సీడీపీవో కార్యాలయం వద్ద వరుసలో వేచిఉన్న అంగన్‌వాడీలు

సీడీపీవో కార్యాలయానికి అంగన్‌వాడీల క్యూ

● షోకాజ్ నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు కార్యాలయానికి..

పర్చూరు, జనవరి 17: అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెను అణచివేసేందుకు ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని తెరమీదకు తెచ్చింది. అందులో భాగంగా ఇప్పటికే అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు ప్రభుత్వం షోకాజ్ నోటీలను జారీచేసింది. 10 రోజల లోపు వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొంది. దీంతో గడువు ముగియనుండటంతో బుధవారం షోకాజ్ నోటీసుకు సమాధానం ఇచ్చేందుకు సీడీపీవో కార్యాలయానికి అంగన్‌వాడీలు క్యూకట్టారు. పెద్ద ఎత్తున అంగన్‌వాడీలు కార్యాలయానికి చేరుకోటంతో అధికారులు సైతం ఉక్కిరి బిక్కిరి అయ్యారు.

బల్లికురవలో..

బల్లికురవ : అంగన్‌వాడీ కార్యకర్తలకు పది రోజుల క్రితం పంపిన నోటీసులపై వివరణ ఇచ్చేందుకు మండలంలోని 64 కేంద్రాల అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం సంతమాగులూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి వెళ్లి రాత పూర్వకంగా వివరణ ఇచ్చారు. ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీ మేరకు జీతాలు పెంపుదల చేయాలని లేకుంటే సమ్మెలోనే ఉంటామని వారు తెలిపారు. అంగన్ వాడీ కార్యకర్తలకు సీఐటీయు నేతలు సంఘీభావం ప్రకటించారు.



ప్రాజెక్టు కార్యాలయానికి తరలి వెళుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన

యద్దనపూడి (మార్టూరు) జనవరి 17: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎం లను వినియోగించే విధానంపై బుధవారం మండలంలో రెవెన్యూ అధికారులు ఓటర్లకు అవగాహన కలిగించారు. మండలంలోని అనంతవరం, సూరారపల్లి, యనమదల గ్రామాలలో అధికారులు ఓటర్లకు ఈవీఎంలలో ఏవిధంగా ఓటు వేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కె రవికుమార్, డీటీ విష్ణు, ఎస్ఏ భాస్కరరావు, వీఆర్‌వోలు శేషుబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఈవీయంల వినియోగంపై అవగాహన కలిగిస్తున్న రెవెన్యూ అధికారులు

30 నుంచి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

చీరాల, జనవరి 17 : స్థానిక సాంస్కృతిక సమితి, చైతన్య భారతి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ నుంచి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఉమామోహన్, భాగి నారాయణశాస్త్రీలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముంతావారిసెంటర్లోని ఎస్‌వీఎస్ అండ్ ఎస్‌జేఆర్ కల్యాణమండపంలో జరిగే ఉత్సవాలకు అందరూ ఆహ్వానితులేనని చెప్పారు. అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న కృష్ణయ్య

శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి

అద్దంకి, జనవరి17: శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని సీఐ కృష్ణయ్య అన్నారు. అద్దంకి పట్టణ సీఐగా ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నర్సరావుపేట రూరల్ సీఐగా పనిచేస్తూ బదిలీపై అద్దంకిసీఐగా వచ్చారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ అద్దంకి పట్టణంలో ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తానని అన్నారు.

సంతమాగులూరు సీఐ బాధ్యతల స్వీకరణ

సంతమాగులూరు, జనవరి 17: సంతమాగులూరు సీఐగా కె. నరసింహారావు బుదవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన ప్రభాకర రావు వీఆర్‌కు బదిలీ కావడంతో నరసింహారావు సంతమాగులూరుకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే అద్దంకి వెళ్ళి వైసీపీ అద్దంకి ఇన్‌చార్జి పాణ్యం హనిమిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న నరసింహారావు

సీకేఎస్ ఫౌండేషన్‌కు టీవీ బహూకరణ

పంగులూరు, జనవరి 17 : స్థానిక సీకేఎస్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న వృద్ధుల ఆశ్రమానికి గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్మీ సైంటిస్ట్ రాయిణి రామారావు టీవీని బహుకరించారు. రామారావు, భారతిల కుమారులు ప్రశాంత్, ప్రవీణ్‌ల జ్ఞాపకార్ధం ఫౌండేషన్ యజమాని షడ్రక్‌కు బుధవారం టీవీని అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన కేబుల్ నెట్‌వర్క్ యజమాని గుర్రం ఆంజనేయులు దంపతులు ఆశ్రమంలోని వృద్ధ మహిళలకు చీరలు బహూకరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రాయిణి ప్రమీల, ఆర్.వి.సుబ్బారావు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



టీవీ బహూకరిస్తున్న విశ్రాంత ఆర్మీ సైంటిస్ట్ రాయిణి రామారావు దంపతులు

నేడు ఎన్టీఆర్ వర్ధంతి

అద్దంకి, జనవరి17: టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా అద్దంకి పట్టణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9 గంటలకు కాకానిపాలెం లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారని పట్టణ తెలుగుయువత అధ్యక్షుడు వడ్లవల్లి పూర్ణచంద్రరావు, నందమూరి కళాపరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు మన్నం త్రిమూర్తులు, నాగినేని రామకృష్ణలు తెలిపారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఉదయ భాస్కర్ దంపతులు

పర్చూరు, జనవరి 17: విద్యాదాత దివంగత పాబోలు రాధాకృష్ణ మూర్తి వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో నిరుపేద వృద్ధులకు వారి కుమారుడు పాబోలు ఉదయ భాస్కర్, గిరిజా కుమారిలు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఉదయ భాస్కర్ మాట్లాడుతూ తన తండ్రి చేసిన సేవాకార్యక్రమాలను కొనసాగించే విధంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాటి లింగేశ్వరరావు, కాసా అజయ్ కుమార్, పాబోలు తేజ, కొసనా వెంకటేశ్వర్లు, హనుమంతురావు, శ్రీరాం వెంకటసుబ్బారావు, కొత్తూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మండలంలో కులగణన సర్వే


పంగులూరు, జనవరి 17 : మండలంలో ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు కుల గణన సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామాంజనేయులు తెలిపారు. మండలంలోని 14 సచివాలయాల పరిధిలో గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సంయుక్తంగా ఈ సర్వే నిర్వహిస్తారని తెలిపారు. మండల అధికారులను సర్వే నిర్వహణపై పర్యవేక్షణ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. ఈ సర్వే యాప్‌లో నమోదు పరచిన డేటాను కేవలం క్యాస్ట్ సర్వేకు మాత్రమే ఉపయోగిస్తారని ఎంపీడీవో తెలిపారు. మండల ప్రజలు ఈ కులగణనకు సహకరించాలని కోరారు.

ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు

మార్టూరు, జనవరి 17: మండలంలోని వలపర్ల గ్రామంలో టీడీపీ,జనసేన పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ పోటీలలో మొదటి బహుమతిగా రూ. 5 వేల నగదును దామర్ల లక్ష్మీ సాయి దుర్గ, రెండవ బహుమతిగా రూ. 3 వేలు నగదును కూర్మాల రమ్యకృష్ణ , మూడవ బహుమతిగా రూ. 2 వేలు నగదును యం.శ్రావణి గెలుచుకున్నారు. వారికి టీడీపీ నాయకులు కంభం పాటి హనుమంతరావు, మాలపాటి రాఘవయ్య, జనసేన పార్టీ నాయకులు అందజేశారు.

ఎస్మాపై అంగన్‌వాడీల నిరసన

వేటపాలెం(చీరాల), జనవరి 17 : తమపై ఎస్మా ప్రయోగాన్ని ఎత్తివేయాలని, న్యాయబద్ధంగా హక్కుల సాధన కోసం చేపట్టిన దీక్షపై ఎస్మా ప్రయోగమనేది ప్రభుత్వ నియంతచర్యగా అంగన్‌వాడీలు అభివర్ణించారు. ప్రభుత్వం చర్యలపై వారు మండిపడ్డారు. స్థానిక సీడీపీవో కార్యాలయం వద్ద బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలు ఎర్రటి అగ్గిలో నిరసన వ్యక్తం చేస్తూ బైఠాయించారు. అందులో ఓ అంగన్‌వాడీ కార్యకర్త చంటిబిడ్డతో నిరసనలో పాల్గొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించేవరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారికి సీఐటీయూ బాధ్యులు ఎం. వసంతరావు, ఎన్.బాబూరావులు సంఘీభావం తెలిపారు.



సీడీపీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అంగన్‌వాడీలకు బీఎస్పీ సంఘీభావం

అద్దంకిటౌన్ : అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఎస్పీ అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు పారి యోహాను డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన అంగన్‌వాడీల ధర్నాకు బీఎస్పీ నాయకులు తమ సంఘీభావాన్ని తెలియజేశారు. నాయకులు మందా జోసఫ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు, పొనకా రామాంజనేయులు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు జి. శారద పాల్గొన్నారు.



సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న బీఎస్పీ నాయకులు